# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 2 సంచిక : 15 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల ఆదివారం 20 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE : 15 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA SUN 20 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# పేదల ఆనందం చూసి నా జీవితం ధన్యమైంది

**ప్రాణం ఉన్నంతవరకు ఈ క్షణాన్ని గుర్తుపెట్టుకుంటాను: విశాఖలో చంద్రబాబు ఎమోషనల్**

- విశాఖలో 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాల పంపిణీ
- మీ ఇంటిపై సర్వ హక్కులు మీవేనని సీఎం చంద్రబాబు భరోసా
- విశాఖను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని భారీ ప్రకటన
- గోదావరి జలాలతో నగర నీటి కష్టాలు శాశ్వతంగా తీరుస్తామని హామీ
- గత ప్రభుత్వ పాలనలో భూ కబ్జాలు, కూల్చివేతలపై తీవ్ర విమర్శలు






పెన్ పవర్ డెస్క్:విశాఖ నగరంలోని వేలాది పేద కుటుంబాల దశాబ్దాల కల నెరవేరింది. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం ద్వారా 28,445 కుటుంబాలకు వారు నివసిస్తున్న ఇళ్లపై సర్వ హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేశారు. శనివారం విశాఖలో జరిగిన సభలో ఆయన లబ్ధిదారులకు

- మిగతా 2లో



## సొంత నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన.. సోమవారం నుంచే!

- పిఠాపురంలో రూ. 1,500 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించనున్న పవన్ కళ్యాణ్
- రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- రూ. 200 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్‌కు శ్రీకారం
- మహిళా సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలు, మత్స్యకారులకు ఆధునిక పరికరాల పంపిణీ
- తాగునీటి పథకాలు, రోడ్ ఓవర్ బ్రిడ్జి వంటి కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన

పెన్ పవర్ డెస్క్:ఏపీ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తన నియోజకవర్గ అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పిఠాపురాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో, సుమారు రూ. 1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా సోమవారం నుంచి రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.పర్యటనలో భాగంగా

- మిగతా 2లో



## ఏపీ అమ్మాయిలు టీమిండియాలో ఆడాలి


- మంగళగిరిలో మహిళల ఏపీఎల్ ప్రారంభంపై మంత్రి లోకేశ్ హర్షం
- ఏపీ అమ్మాయిలు జాతీయ జట్టుకు ఆడాలన్నదే లక్ష్యమని వెల్లడి
- ట్రోఫీని ఆవిష్కరించిన నారా బ్రాహ్మణి, బ్రాండ్ అంబాసిడర్ మిథాలీ రాజ్
- వేదిక కల్పించిన ఏసీఏకు లోకేశ్ అభినందనలు
- ఏపీ నుంచి భవిష్యత్ ఛాంపియన్లు వస్తారని ఆశాభావం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ మహిళా క్రికెటర్లు జాతీయ జట్టులో స్థానం సంపాదించాలన్నదే తన ఆకాంక్ష అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని మహిళా క్రికెటర్ల కలల ను సాకారం చేసేందుకు తొలిసారిగా నిర్వహిస్తున్న మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఏపీఎల్) ఒక బలమైన వేదిక అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.శనివారం సాయంత్రం మంగళగిరిలో డబ్ల్యూఏపీఎల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టోర్నమెంట్ ట్రోఫీని నారా బ్రహ్మణి, భారత మహిళా క్రికెట్ దిగ్గజం, టోర్నీ బ్రాండ్ అంబాసిడర్ మిథాలీరాజ్‌తో కలిసి ఆవిష్కరించారు.ఈ టోర్నీ ప్రారంభంపై మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ తన

- మిగతా 2లో

## అండమాన్‌లో అల్పపీడనం.. మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండం

- ఉత్తర అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం
- వాయుగుండంగా బలపడి ఉత్తరాంధ్ర తీరం వైపు పయనం
- సోమవారం నుంచి కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం
- తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరిక
- మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ సంస్థ సూచన




పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి వర్ష సూచన వెలువడింది. ఉత్తర అండమాన్, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ

- మిగతా 2లో

## కర్ణాటక పర్యటనలో అమిత్ షాకు అస్వస్థత

- హుబ్బళ్లి పర్యటనలో అస్వస్థతకు గురైన అమిత్ షా
- మెడికల్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి గైర్హాజరు
- వైద్యుల సూచన మేరకు హోటల్‌లోనే విశ్రాంతి
- ఆయన స్థానంలో పాల్గొన్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



పెన్ పవర్ డెస్క్:కర్ణాటక పర్యటనలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో హుబ్బళ్లిలో ముందుగా నిర్ణయించిన కార్యక్రమానికి ఆయన హాజరు కాలేకపోయారు. వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించడంతో ఆయన హోటల్‌కే పరిమితమయ్యారు. హుబ్బళ్లిలోని కేఎల్‌ఈ జగద్గురు గంగాధర్

- మిగతా 2లో



## భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

- 20వ రోజ్‌గార్ మేళాలో 51,000 మందికి పైగా నియామక పత్రాల పంపిణీ
- భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరణ
- చిన్న నగరాల్లోనూ స్టార్టప్‌లు వస్తుండటం శుభపరిణామం అన్న ప్రధాని
- రూ. లక్ష కోట్లతో ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ప్రారంభం
- కొత్తగా చేరిన ఉద్యోగులకు నిరంతర అభ్యాసంపై ప్రధాని మోదీ సూచన

- మిగతా 2లో



## తిరుమలలో వైభవంగా సాగిన గరుడ సేవ..

### రెండు లక్షల మంది భక్తులతో పోటెత్తిన మాఢవీధులు

- శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో విశిష్టమైనది గరుడ సేవ
- గరుడ వాహనంపై భక్తులను కటాక్షించిన మలయప్ప స్వామి
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో కిక్కిరిసిన మాడ వీధులు
- గోవింద నామస్మరణలతో మార్మోగిన తిరుమల కొండ
- భక్తుల కోసం టీటీడీ భారీ ఏర్పాట్లు, నిరంతర పర్యవేక్షణ

పెన్ పవర్ డెస్క్:తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన గరుడ వాహన సేవ శనివారం రాత్రి అంగరంగ వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. గరుత్మంతునిపై శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువైన శ్రీ మలయప్పస్వామి వారు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ

- మిగతా 2లో



## కరవులో రైతాంగం.. దోపిడీలో కూటమి ప్రభుత్వం

- తప్పుడు హామీలతో ప్రజలను నమ్మించి కూటమి అధికారంలోకి వచ్చిందంటూ పేర్ని నాని ధ్వజం
- సూపర్ సిక్స్ హామీలు ప్రకటనలకే పరిమితం అయ్యాయని విమర్శ
- ప్రజల నుంచి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరిక

- మిగతా 2లో

## ఇంటర్ బోర్డులో డిజిటలైజేషన్, రిటైర్మెంట్ వయోపరిమితి పెంపు

- లోకేశ్ నివాసంలో ఇంటర్ బోర్డు పాలకవర్గం సమావేశం
- 1978 నుంచి జారీ చేసిన ఇంటర్ సర్టిఫికెట్లను డిజిటలైజ్ చేయాలని నిర్ణయం
- ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 60 నుంచి 62కి పెంచాలని తీర్మానం



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యారంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా వైవిధ్యమైన సంస్కరణలకు తెరలేపారు. ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధ్యక్షతన జరిగిన ఇంటర్ బోర్డు 78వ పాలకవర్గ సమావేశంలో విద్యార్థుల భవిష్యత్తుతో పాటు ఉద్యోగుల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకుంటూ

- మిగతా 2లో



## మానవత్వం చాటుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

పెన్ పవర్ డెస్క్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధి తులకు సాయమందించి కేంద్ర మంత్రి బండి సంజయ్ మానవత్వం చాటుకున్నారు. రాజీవ్ రహదారిలో ఓ కారు సిద్దిపేట నుంచి గజ్వేల్ వైపు వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. భర్త డ్రైవింగ్ చేస్తుండగా.. భార్య ముందు సీట్లో, కుమార్తె వెనుక సీట్లో కూర్చున్నారు. ప్రమాద సమయంలో ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో దంపతులకు ప్రాణాపాయం తప్పింది. వెనుక సీట్లో ఉన్న కుమార్తె తల, ముక్కుకు తీవ్ర గాయాలయ్యాయి.

- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## జగన్ నిర్ణయం మార్చుకున్నారా?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ రాజీపడుతున్నారా? తన నైజాన్ని పక్కన పెట్టి వచ్చే ఎన్నికల్లో విజయం కోసం నిర్ణయాలను మార్చుకోవాలని భావిస్తున్నారా? అంటే నిజమేనని అంటున్నారు. వైసీపీ నుంచి వీడిన నేతలను తిరిగి చేర్చుకునేందుకు జగన్ సిద్ధమవుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. వైసీపీ నుంచి వీడిన కొందరు కీలక నేతలను తిరిగి పార్టీలోకి చేర్చుకునేందుకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సానుకూలంగా ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. 2024 ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత పలువురు సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడిన సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుత మారుతున్న సమీకరణాల నేపథ్యంలో, వీరిలో కొందరు నాయకులు తిరిగి పార్టీలోకి రావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది.

**రీ-ఎంట్రీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నారా?**

పార్టీ వీడిన కొందరు కీలక స్థానిక నాయకులను, మాజీ మంత్రులను తిరిగి చేర్చుకోవడం ద్వారా క్యాడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపవచ్చని వైఎస్ జగన్ భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషణలు చెబుతున్నాయి. గతంలో వ్యతిరేకించినప్పటికీ, మారుతున్న పరిస్థితుల్లో కొందరు మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు మళ్లీ జగన్ వైపు మొగ్గు చూపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేయడంపై అధినేత ప్రత్యేక దృష్టి పెట్టారు. గతంలో భీమవరం నుంచి గెలిచిన గ్రంధి శ్రీనివాస్ లాంటి నేతల రీ-ఎంట్రీ గురించిన చర్చలు పార్టీ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ఇతర పార్టీలోకి వెళ్లిన నేతలు అక్కడ సంతృప్తికరంగా లేకపోవడం, తగిన ప్రాధాన్యత లేకపోవడంతో తిరిగి ఫ్యాన్ గూటికి చేరడంపై కొందరు ముఖ్య వైసీపీ నేతలతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం అందుతుంది. అయితే ఇందులో ఎవరు వస్తారు? ఎవరిని తిరిగి పార్టీలోకి తీసుకోవాలి? అన్న విషయంపై జగన్ ఇంకా నిర్ణయం తీసుకోలేదని సమాచారం.

**పార్టీని బలోపేతం చేసే వ్యూహమే...**

ఇతర పార్టీల నుంచి లేదా సొంత గూటికి తిరిగి వచ్చే నేతల వల్ల పార్టీకి మైలేజీ పెరిగి, స్థానికంగా బలం చేకూరుతుందనుకుంటే ఖచ్చితంగా తలుపులు తెరిచే ఉంచాలనే సంకేతాలు పార్టీ అంతర్గత సమావేశాల్లో వ్యక్తమయ్యాయి. ఒకవైపు పార్టీ వీడుతున్న నేతలను ఆపుతూనే, మరోవైపు పోయిన వైభవాన్ని తిరిగి తెచ్చుకునేందుకు, స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసేందుకు జగన్ తన వ్యూహాలకు పదును పెడుతున్నారు. అయితే, ఇప్పటివరకు ఈ నాయకుల రీ-ఎంట్రీలపై పార్టీ పరంగా ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ, కొందరు మాజీ నేతలు మాత్రం వైఎస్ జగన్‌తో టచ్‌లోకి వెళ్లినట్లు గట్టిగా ప్రచారం సాగుతోంది. అయితే పార్టీ క్లిష్ట సమయంలో వీడిన నేతలను తిరిగి చేర్చుకోవడంపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అలా చేర్చుకున్నందువల్ల పార్టీ పట్ల నిబద్ధత, అంకిత భావం కొరవడుతుందని, కష్టమైనా, నష్టమైనా నమ్ముకున్న వాళ్లకే అవకాశమివ్వాలన్న వాదన కూడా వినపడుతుంది. మరి జగన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది. జగన్ అనివార్య పరిస్థితుల్లో రాజీ పడుతున్నట్లు స్పష్టమవుతోంది. మరి ఈ వ్యూహాలు ఏ మేరకు ఫలిస్తాయో, స్థానిక ఎన్నికల్లో వైసీపీ ఏ విధంగా నిలదొక్కుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

## అండమాన్‌లో అల్పపీడనం.. మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండం

- మొదటి పేజి తరువాయి

సంస్థ వెల్లడించింది. ఇది రానున్న రోజుల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని, దీని ప్రభావంతో కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ కథనం ప్రకారం, ప్రస్తుతం అండమాన్‌లో కేంద్రీకృతమైన ఈ అల్పపీడనం క్రమంగా బలపడనుంది. సోమవారం నాటికి ఇది వాయుగుండంగా, మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉంది. అనంతరం వాయవ్య దిశగా పయనించి, బుధవారం ఉదయానికి దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఈ అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణం మారనుంది. ఆదివారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై, పలుచోట్ల విస్తారంగా వర్షాలు పడతాయని తెలిపింది. ముఖ్యంగా సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో రానున్న ఐదు రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. తీరప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

## తిరుమలలో వైభవంగా సాగిన గరుడ సేవ..

- మొదటి పేజి తరువాయి

లక్షలాది మంది భక్తులకు అభయమిచ్చారు. ఈ అపు రూప దృశ్యాన్ని కనులారా వీక్షించేందుకు తరలివచ్చిన భక్తుల “గోవిందా.. గోవిందా..” నామస్మరణలతో సప్తగిరులు మార్మోగాయి. శనివారం సాయంత్రం 6:30 గంటలకు వాహన మండపం నుంచి గరుడ వాహనంపై స్వామివారు బయటకు రాగానే, మాడ వీధుల్లోని గ్యాలరీలలో వేచి ఉన్న భక్తుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గజరాజులు ముందు నడుస్తుండగా, భజన బృందాలు, కోలాటాలు, జీయంగార్ల ఘోష్టి, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు అత్యంత భక్తిశ్రద్ధలతో సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకుని పులకించిపోయారు.

**భక్తులతో కిక్కిరిసిన మాడ వీధులు**

గరుడ సేవను తిలకించేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. మాడ వీధుల్లోని 1.90 లక్షల మంది సామర్థ్యం గల గ్యాలరీలు శుక్రవారం రాత్రికే భక్తులతో కిక్కిరిసిపోయాయి. గ్యాలరీలలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ శనివారం ఉదయం నుంచే పాలు, అన్నప్రసాదాలు, తాగునీరు, అల్పాహారం వంటివి నిరంతరాయంగా అందించింది. సుమారు 2000 మంది శ్రీవారి సేవకులు ఈ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు సేవలందించారు.

**టీటీడీ ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణ**

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి స్వయంగా మాడ వీధుల్లో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. జేఈవోలు శరత్, గోపీనాథ్ శిలాతోరణం వద్ద క్యూలైన్లలోని భక్తులకు అందుతున్న అన్నప్రసాదం, నీటి సరఫరాను పరిశీలించారు. సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. సుమారు 600 మంది టీటీడీ ఉద్యోగులు తిరుమలలోని 8 కీలక ప్రాంతాల్లో సెక్టోరల్ అధికారులుగా విధులు నిర్వర్తించారు. వైష్ణవ సంప్రదాయంలో గరుడ సేవకు విశిష్ట ప్రాధాన్యం ఉంది. జ్ఞాన, వైరాగ్యాలకు ప్రతీక అయిన గరుత్మంతునిపై ఉన్న స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ అద్భుతమైన కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, పలువురు టీటీడీ బోర్డు సభ్యులు, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అర్ధాంగి వసుంధర దేవి కూడా ఈ వేడుకకు హాజరయ్యారు.

# పేదల ఆనందం చూసి నా జీవితం ధన్యమైంది

- మొదటి పేజి తరువాయి

కన్వీనియన్స్ డీడ్స్ అందజేశారు. ఈ నిర్ణయంతో వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపామని అన్నారు. వేలాది కుటుంబాల దశాబ్దాల కల సాకారమైన వేళ వారి ముఖాల్లో వెల్లివిరిసిన ఆనందాన్ని చూసి, “మీ ముఖాల్లో ఈ ఆనందం చూస్తే నా జీవితం ధన్యమైంది. నా ప్రాణం ఉన్నంతవరకు ఈ క్షణాన్ని గుర్తుపెట్టుకుంటాను” అంటూ చంద్రబాబు భావోద్వేగంతో ప్రసంగించారు. ఇది కేవలం పట్టాల పంపిణీ కాదని, పేద ప్రజల ఆత్మగౌరవానికి, వారి పిల్లల భవిష్యత్తుకు చేస్తున్న పట్టాభిషేకం అని ఆయన అభివర్ణించారు.

**దశాబ్దాల నిరీక్షణకు తెర.. సర్వ హక్కులు మీవే!**

“కూడు, గూడు, గుడ్డ అనేది మా విధానం. 40 ఏళ్ల క్రితమే ఎన్టీఆర్ పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలని సంకల్పిస్తే, అదే స్ఫూర్తితో మేము పనిచేస్తున్నాం” అని చంద్రబాబు గుర్తుచేశారు. దశాబ్దాలుగా సొంత కష్టార్జితంతో నిర్మించుకున్న ఇళ్లలో నివసిస్తున్నా, వాటిపై పూర్తి హక్కు లేదనే వేదనతో జీవిస్తున్న లక్షలాది మందికి ఈ పట్టాభిషేకం ద్వారా విముక్తి కల్పించామన్నారు. “నిన్నటి వరకు మీ ఇంటిపై మీకు హక్కు లేదు. కానీ ఈరోజు నుంచి మీ ఇంటి మీద సర్వ హక్కులు మీవే. ఇకపై అనుమానం లేదు, వివాదం లేదు, భయం లేదు. తిరుగులేని హక్కు మాత్రమే ఉంటుంది” అని ఆయన భరోసా ఇచ్చారు. విశాఖ నగర పరిధిలోని గాజువాక, పెందుర్తి, భీమిలి, గోపాలపట్నం సహా 111 మండలాల్లోని 399 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 19.33 లక్షల చదరపు గజాల భూమిని క్రమబద్ధీకరించి, రూ. 8,874 కోట్ల రిజిస్ట్రేషన్ విలువైన ఆస్తిని ప్రజలకు అప్పగించామని తెలిపారు. “నిన్నటి వరకు అప్పు కావాలంటే గ్యారెంటీ లేని మీరు, ఈరోజు ఈ ప్రభుత్వం ఇచ్చిన పట్టాతో ఏ బ్యాంకులోనైనా స్వేచ్ఛగా రుణం పొందవచ్చు” అని ఆయన స్పష్టం చేశారు.

**మిగిలిన వారికీ త్వరలోనే పట్టాలు.. అధికారులకు ఆదేశాలు**

ఈ కార్యక్రమంతోనే ఆగమని, వివిధ కారణాలతో ఆగిపోయిన మరో 35 కాలనీల్లోని 10,000 కుటుంబాలకు, వివాదాల్లో ఉన్న పంచగ్రామాల పరిధిలోని 12,149 మందికి కూడా త్వరలోనే పట్టాలు అందించి శాశ్వత హక్కులు కల్పిస్తామని చంద్రబాబు సభాముఖంగా హామీ ఇచ్చారు. “దేవాలయ భూముల వివాదాలను కోర్టుల ద్వారా పరిష్కరించి, వీలైనంత తొందరగా మీ అందరికీ న్యాయం చేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది” అని ఆయన కలెక్టర్‌కు వేదిక నుంచే ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న ప్రతి పేదవాడికీ హక్కు పత్రాలు అందించి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

**దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినట్టే!**

గత ఐదేళ్ల పాలనపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. “గత ఐదేళ్లు ఒక పీడకల. రూ.10 లక్షల కోట్ల అప్పులు, ఎక్కడ చూసినా కుంభకోణాలు, భూకబ్జాలు, కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. ప్రశాంతమైన ఉత్తరాంధ్రలో అలజడి సృష్టించారు. శుక్రవారం వచ్చిందంటే ఏ ఇంటిని కూలుస్తారో తెలియని భయానక వాతావరణం ఉండేది” అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. “విశాఖను రాజధాని చేస్తామంటూనే, రుషికొండపై ఋషులు తపస్సు చేసిన చోట ప్యాలెస్‌లు కట్టుకున్నారు. ఆ ప్యాలెస్‌ను ఏం చేయాలో కూడా అర్థం కాని దుస్థితిలో మేమున్నాం. దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినంత ఖర్చు అవుతుంది” అని ఎద్దేవా చేశారు. “నాడు కబ్జాలు, కూల్చివేతలు ఉంటే.. నేడు హక్కులు, భరోసా ఇస్తున్నాం. విధ్వంసం నుంచి వికాసం వైపు, భయం నుంచి భరోసా వైపు, నిరాశ నుంచి కొత్త ఆశల వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం” అని ఆయన ఉద్ఘాటించారు.

**విశాఖ ఇక విశ్వనగరం.. నీటి సమస్యకు ఎన్డీయే గ్యారెంటీ!**

విశాఖపట్నం భవిష్యత్తుపై చంద్రబాబు స్పష్టమైన దార్శనికతను ఆవిష్కరించారు. “రాబోయే రోజుల్లో విశాఖ ఒక విశ్వనగరంగా మారబోతోంది. ఇది ఇక అన్‌స్టాపబుల్. గూగుల్, రిలయన్స్ డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులతో పాటు అనేక ఐటీ పరిశ్రమలు వస్తున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుంది” అని ఆయన ప్రకటించారు.

విశాఖ నీటి సమస్యపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ, “ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గినా, ముందుచూపుతో మేము పూర్తి చేసిన పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీళ్లు తెచ్చాం. ఇప్పుడు అదే కాలువను విశాఖ వరకు పొడిగించి, గోదావరి జలాలతో నగర దాహార్తిని శాశ్వతంగా తీర్చే బాధ్యత మా ఎన్డీయే ప్రభుత్వానిది. భవిష్యత్తులో విశాఖకు నీటి కొరత ఉండదు, ఇది మా గ్యారెంటీ” అని చంద్రబాబు గట్టిగా హామీ ఇచ్చారు.

**అభివృద్ధికి అండగా నిలవండి.. 2047 లక్ష్యం మనదే!**

పరిశ్రమలు తెచ్చి అవకాశాలు కల్పించడం తమ బాధ్యత అని, వాటిని అందిపుచ్చుకుని యువత ఎదగాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. “విశాఖ ఉక్కును కాపాడింది ఎన్డీయే ప్రభుత్వం. రైల్వే జోన్‌ను రియాలిటీగా మార్చింది మేము. పేదరికం లేని సమాజం, ఆర్థిక అసమానతలు తగ్గడమే మా లక్ష్యం” అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ‘స్వచ్ఛాంధ్ర’లో భాగస్వాములు కావాలని కోరారు. “2047 నాటికి ‘వికసిత భారత్’తో దేశం ప్రపంచంలో నంబర్ వన్ అవుతుంది. అదే సమయంలో ‘స్వర్ణాంధ్ర 2047’ లక్ష్యంతో మన రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతాం. ప్రపంచంలోనే తెలుగు జాతిని అత్యంత శక్తివంతమైన జాతిగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిదీ” అని పిలుపునిస్తూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, నారాయణ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఇంటర్ బోర్డులో డిజిటలైజేషన్, రిటైర్మెంట్ వయోపరిమితి పెంపు

- మొదటి పేజి తరువాయి

అనేక కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేశారు. నకిలీ సర్టిఫికెట్ల అక్రమాలకు శాశ్వతంగా ముగింపు పలకాలనే దృఢ సంకల్పంతో 1978 నుంచి జారీ చేసిన ఇంటర్మీడియట్ విద్యార్హత పత్రాలన్నింటినీ సమగ్రంగా డిజిటలైజ్ చేయాలని ప్రతిపాదించారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఈ రికార్డులను అత్యాధునిక ‘బ్లాక్‌చైన్ టెక్నాలజీ’తో అనుసంధానించనున్నారు. విద్యా పునర్నిర్మాణంతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి తీపి కబురు అందిస్తూ వారి పదవీ విరమణ వయోపరిమితిని 60 సంవత్సరాల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ తుది తీర్మానం చేశారు. దీనికితోడు పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేసే క్రమంలో ఇన్విజిలేటర్లు, మూల్యాంకనదారుల శ్రమను గుర్తించి వారు అందుకునే భత్యాలను ఏకంగా 25 శాతం వరకు పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.

పరీక్షల్లో విద్యార్థుల సౌకర్యార్థం థియరీ సబ్జెక్టులకు 32 పేజీల బుక్‌లెట్లను అందించనున్నారు. మూల్యాంకనంలో ఏమాత్రం అలసత్వం వహించినా లేదా తీవ్రమైన తప్పులకు పాల్పడినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది.

# కర్ణాటక పర్యటనలో అమిత్ షాకు అస్వస్థత

- మొదటి పేజి తరువాయి

మహాస్వామిగళు మూరుసవిర్మఠ్ మెడికల్ కాలేజీ నూతన భవనాన్ని, 1,200 పడకల కేఎల్ఈ హాస్పిటల్ అండ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్‌ను అమిత్ షా ప్రారంభించాల్సి ఉంది. రూ.700 కోట్ల వ్యయంతో ఈ మెడికల్ కాలేజీ భవనాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమం నిమిత్తం షెడ్యూల్ ప్రకారమే శుక్రవారం రాత్రి ఆయన హుబ్బళ్లి చేరుకుని ఒక హోటల్‌లో బస చేశారు. అయితే, శనివారం ఉదయం ఆయన అనారోగ్యానికి గురికావడంతో ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. అమిత్ షా గైర్హాజరీలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, కర్ణాటక వైద్య విద్యా శాఖ మంత్రి శరణ్ ప్రకాశ్ పాటిల్, మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనారోగ్య కారణాల వల్లే అమిత్ షా ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారని కేఎల్ఈ సొసైటీ ఛైర్మన్ ప్రభాకర్ కోరే స్పష్టం చేశారు.

# భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

దేశ యువత సామర్థ్యానికి, వారి సత్తాకు దేశంలోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థే ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన స్టార్టప్‌ల కథ ఇప్పుడు చిన్న పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించిందని ఆయన పేర్కొన్నారు.

20వ రోజ్‌గార్ మేళా సందర్భంగా శనివారం ఆయన వివిధ ప్రభుత్వ సంస్థలకు కొత్తగా ఎంపికైన యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల నుంచి 51,000 మందికి పైగా యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. “భారతదేశం నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచింది. గుర్తించబడిన స్టార్టప్‌లలో దాదాపు సగం టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయి. ఇది భారతదేశ నూతన ఆర్థిక వ్యవస్థలో గ్రామాలు, పట్టణాలు, చిన్న నగరాల నుంచి వచ్చిన యువత కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని చూపిస్తోంది” అని వివరించారు. చిన్న పట్టణాలకు చెందిన యువత తమ సొంత ఆలోచనలతో కొత్త కంపెనీలను స్థాపిస్తూ, తమతో పాటు ఇతర యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలను వేగంగా విస్తరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు. “ఈ లక్ష్యంతోనే సుమారు రూ. 1 లక్ష కోట్లతో ‘ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన’ను ప్రారంభించాం. ఈ పథకం ద్వారా దాదాపు 2 కోట్ల మంది యువత తొలిసారిగా ఉద్యోగ రంగంలోకి ప్రవేశించే అవకాశం లభిస్తుంది. మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి రూ. 15,000 వరకు ప్రోత్సాహకం అందించడంతో పాటు, కొత్త ఉద్యోగాలను సృష్టించే యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహకాలు ఉంటాయి” అని తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలో భాగం కాబోతున్న నూతన ఉద్యోగులకు ప్రధాని కీలక సూచనలు చేశారు. “మీరు, మీ తల్లిదండ్రులు ఎదుర్కొన్న ఇబ్బందులు, కష్టాలు దేశంలోని ఏ పౌరుడూ ఎదుర్కోకుండా చూడటమే మీ లక్ష్యం కావాలి. ప్రభుత్వ సేవలో చేరిన వెంటనే ఈ మిషన్‌ను మీరు చేపట్టాలి” అని పిలుపునిచ్చారు. నిరంతరం నేర్చుకోవడం, కొత్త నైపుణ్యాలు, టెక్నాలజీని అందిపుచ్చుకోవడం చాలా ముఖ్యమని ఆయన అన్నారు. ఇందుకోసం ‘మిషన్ కర్మయోగి’ని రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే 1.70 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులు ‘ఐ-గాట్ కర్మయోగి’ ప్లాట్‌ఫామ్‌లో చేరారని, కొత్తగా చేరే వారి కోసం ‘కర్మయోగి ప్రారంభ్’ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని సిద్ధం చేశామని వివరించారు. మీరు మిమ్మల్ని ఎంతగా మెరుగుపరుచుకుంటే, దేశ పౌరులకు అంత మెరుగైన సేవలు అందించగలరని ప్రధాని పేర్కొన్నారు.

# మానవత్వం చాటుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

- మొదటి పేజి తరువాయి

అదే సమయంలో సిరిసిల్ల వైపు వెళ్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రమాదాన్ని గమనించి.. వెంటనే తన వాహనాన్ని నిలిపి భద్రతా సిబ్బందితో కలిసి కారు వద్దకు వెళ్లారు. కారులో చిక్కుకున్న బాధితులను బయటకు తీసేందుకు సహకరించారు. తీవ్రంగా గాయపడిన కుమార్తెతో పాటు ఆమె తల్లిదండ్రులను తన భద్రతా సిబ్బంది వాహనంలో వెంటనే ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కేంద్ర మంత్రి సూచించారు.

# ఏపీ అమ్మాయిలు టీమిండియాలో ఆడాలి

- మొదటి పేజి తరువాయి

సంతోషాన్ని పంచుకున్నారు. “మంగళగిరిలో తొలి మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ప్రారంభం కావడం చాలా ఆనందంగా ఉంది. యువ మహిళా క్రికెటర్లు తమ ప్రతిభను ప్రదర్శించడానికి, ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి డబ్ల్యూఏపీఎల్ బలమైన పునాది వేస్తుంది” అని ఆయన పేర్కొన్నారు. ఈ టోర్నీకి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న మిథాలీరాజ్‌కు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని క్రీడాకారిణులకు డబ్ల్యూపీఎల్, ఆ తర్వాత టీమిండియాకు ఆడే మార్గాన్ని సుగమం చేస్తున్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌ను లోకేశ్ అభినందించారు. టోర్నీలో పాల్గొంటున్న నాలుగు జట్లకు, ప్రతి క్రీడాకారిణికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ టోర్నమెంట్ ద్వారా ఆంధ్రప్రదేశ్ నుంచి భవిష్యత్ ఛాంపియన్లు ఆవిర్భవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు.

# సొంత నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన.. సోమవారం నుంచే!

- మొదటి పేజి తరువాయి


సోమవారం, రూ. 9.59 కోట్లతో ఆధునికీకరించిన నాగులాపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని పవన్ కల్యాణ్ ప్రజలకు అంకితం చేయనున్నారు. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పథకం ద్వారా చివరి గ్రామాలకు నీరు అందడం లేదన్న సమస్యకు ఈ ఆధునికీకరణతో పరిష్కారం లభించనుంది. దీని ద్వారా 52 ఆవాసాల్లోని సుమారు 97 వేల మందికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. దీంతో పాటు, పిఠాపురం పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం కోసం ఏర్పాటు చేసిన ‘పీఠికాపుర వనం’, చందుర్తి-తాటిపర్తి బీటీ రోడ్డును కూడా ఆయన ప్రారంభించనున్నారు. మంగళవారం నిర్వహించే బహిరంగ సభలో నియోజకవర్గ రూపురేఖలు మార్చే కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. పిఠాపురం ప్రజల చిరకాల వాంఛ అయిన రూ. 200 కోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్, రూ. 118 కోట్లతో రోడ్ ఓవర్ బ్రిడ్జి, రూ. 323 కోట్లతో ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ వంటి భారీ పనులకు ఆయన శ్రీకారం చుడతారు. వీటితో పాటు జల్ జీవన్ మిషన్, అమృత్ 2.0 పథకాల కింద పలు తాగునీటి ప్రాజెక్టులకు కూడా పచ్చజెండా ఊపనున్నారు.

ఈ అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ కార్యక్రమాలకు కూడా పవన్ ప్రాధాన్యత ఇస్తున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలను అందజేయనున్నారు. ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారులకు ఆధునిక లైఫ్ జాకెట్లు, డ్రై ఫిష్ యూనిట్లు, ఐస్ బాక్సులతో కూడిన మోటార్ సైకిళ్లను పంపిణీ చేసి వారి జీవనోపాధికి భరోసా కల్పించనున్నారు. అదేవిధంగా, 89 మంది లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ పట్టాలు అందించి వారి భూములపై హక్కులు కల్పించనున్నారు. ఈ రెండు రోజుల పర్యటన ద్వారా నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పవన్ కల్యాణ్ పటిష్ఠమైన పునాదులు వేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# కరవులో రైతాంగం.. దోపిడీలో కూటమి ప్రభుత్వం

అధికార పీఠం ఎక్కేందుకు ఊహాజనిత హామీలతో ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను పూర్తిగా పక్కనబెట్టేసిందని కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నాయకుడు పేర్ని నాని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా సాగునీరు అందక, సరైన ప్రణాళికలు లేక కరవు కోరల్లో చిక్కుకుని రైతాంగం అల్లాడిపోతుంటే... కూటమి నాయకులు మాత్రం పాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని దోచుకోవడంలో నిమగ్నమయ్యారని ధ్వజమెత్తారు. గతంలో జగన్ అందించిన పారదర్శక సంక్షేమ పథకాల కంటే మిన్నగా పథకాలు ఇస్తామంటూ ఇచ్చిన ‘సూపర్ సిక్స్’ హామీలు ఇప్పుడు ప్రకటనలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ప్రభుత్వ అశాస్త్రీయ విధానాలు, మోసపూరిత వైఖరిపై నియోజకవర్గాల వారీగా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, ఇప్పటికే పలు ప్రాంతాల్లో బాధితులు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారని గుర్తుచేశారు. ఈ ప్రజాగ్రహం నుంచి తప్పించుకునేందుకే కూటమి నాయకత్వం ప్రతిరోజూ కొత్త నాటకాలకు తెరలేపుతోందని, ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజల నుంచి కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని పేర్ని నాని హెచ్చరించారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఏన్.టి.ఆర్ జిల్లా । కృష్టా । గుంటూరు । పల్నాడు । బాపట్ల



## పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపునకు పెద్దపీట -- కలెక్టర్ సైకిల్ ర్యాలీ

**మచిలీపట్నం పెన్ పవర్ సెప్టెంబర్ 19**

కలెక్టర్ బంగ్లా నుండి పాత రైల్వే స్టేషన్ వరకు సైకిల్ తొక్కుకుంటూ వెళ్లిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం: పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపు ఆవశ్యకతను ప్రజలకు తెలియజేసేందుకు కృష్ణా జిల్లా యంత్రాంగం వినూత్న కార్యక్రమం చేపట్టింది.

మచిలీపట్నంలో 'స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఐఏఎస్ గారు స్వయంగా సైకిల్ ఎక్కి ఆదర్శంగా నిలిచారు. కలెక్టర్ బంగ్లా నుండి పాత రైల్వే స్టేషన్ వరకు సైకిల్ పై ర్యాలీ నిర్వహించారు.

ప్రజల్లో పెరుగుతున్న వ్యసనాలు, వాహన కాలుష్యంపై చైతన్యం తేవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. "సైక్లింగ్ వల్ల ఆరోగ్యంతో పాటు పర్యావరణం కూడా కాపాడబడుతుంది. ప్రతి ఒక్కరూ వీలైనంత వరకు సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

ఈ ర్యాలీలో జిల్లా అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కలెక్టర్ గారి ఈ చర్య పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఈవీఎంల భద్రతపై ప్రత్యేక దృష్టి -- ఎన్నికల సంఘం మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలిఈవీఎం గోడౌన్‌లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల



**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్19:**

జిల్లాలోని ఈవీఎం గోడౌన్‌లను జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల శు క్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌లను త్రైమాసిక తనిఖీలలో భాగంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఈవీఎంలు భద్రపరిచిన గదుల వద్ద ఉన్న భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పనితీరు, గోడౌన్ తాళాలు, సీల్స్‌ను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

త్వరలో నిర్వహించనున్న మున్సిపల్, పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అందుబాటులో ఉన్న ఈవీఎంలు, వీవీప్యాట్ యంత్రాలు, బ్యాలెట్ బాక్సుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోడౌన్ పరిసరాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని, భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు.

అలాగే సంబంధిత రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో జిల్లా రెవెన్యూ అధికారి అద్దయ్య, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నాగిరెడ్డి, తహసీల్దార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఎస్.సి, ఎస్.టి సంక్షేమానికి కృషి జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ

**గుంటూరు, సెప్టెంబర్ 19 :**

జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్ లేని యానాది కులానికి చెందిన 531 మందిని గుర్తించామని, డొమిసిల్ సర్టిఫికెట్ తహసిల్దార్ నుండి ఇప్పించి ఆధార్ కార్డులు జారీ చేస్తున్నామని చెప్పారు. గిరిజన భవన్ మరమ్మతుల పనులు మంజూరు చేశామని అన్నారు. అంబేద్కర్ భవన్ పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందించుటకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని అన్నారు. జిల్లాలో మార్పు కార్యక్రమం ప్రత్యేకంగా తీసుకున్నామని, ఈ కార్యక్రమంలో వసతి గృహాలు, ముఖ్యంగా ఎస్.సి, ఎస్.టి వసతి గృహాలలో అన్ని వసతులు కల్పించాలని చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఎస్.సి, ఎస్.టి అభ్యర్థులపై జరిగే దాడులపై నిబంధనల మేరకు కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. మొత్తం కేసులు, డ్రాప్ చేసిన కేసులు వివరాలు కూడా సమావేశంలో అందించాలని పోలీసు శాఖను ఆదేశించారు. పంచర్ ప్రూఫ్ గ్లౌస్ లు పారిశుధ్య కార్మికులకు అందించుటకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ దుకాణాలు నిబంధనల మేరకు కేటాయించాలని ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు. వసతి గృహాలలో మెనూ పక్కాగా, నాణ్యమైన ఆహార పదార్థాలు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశామని అన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలపై వచ్చిన ఆరోపణలపై వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్.సి, ఎస్.టి మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని,





ఆ మేరకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నిర్దేశిత సమయంలో న్యాయం లబ్ధిదారులకు అందించేందుకు సమష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాల్లో సునిశితమైన కేసుల వివరాలు పోస్టు చేయరాదని స్పష్టం చేశారు.

ప్రత్తిపాడు శాసన సభ్యులు డా.బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్ లో కేసులు ఉండకుండా, కేసులు సత్వరం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పింఛను మంజూరు చేయుటకు విద్యుత్ కనెక్షన్ నంబర్ విధిగా ఉండాలని ఎస్.జి.ఎస్.డబ్ల్యు సిబ్బంది అంటున్నారని దానిపై దృష్టి సారించాలని కోరారు. ఎస్.సి, ఎస్.టి చట్టాలపై మరింత అవగాహనను పోలీసు శాఖకు అందించడం అవసరమని అభిప్రాయపడ్డారు.

కమిటీ సభ్యులు పలువురు మాట్లాడుతూ జూలై నుండి ప్రత్తిపాడులో కేసు పెడుతుంటే తీసుకోవడం లేదన్నారు. అనునిత్యం అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పంచర్ ప్రూఫ్ గ్లౌస్ లు పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. ఎస్.సి, ఎస్.టిలకు మంజూరు చేసిన దుకాణాలు, వారే అనుభవించేటట్లు చూడాలని, లబ్ధిదారులు ఇతరులకు ఇచ్చినా చర్యలు తీసుకోవాలని కోరారు. వసతి గృహాలలో ఆహార పదార్థాలు నాణ్యత మెరుగు పరుచుటకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, అదనపు ఎస్పీ జి.వి.రమణ మూర్తి,

రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, జిల్లా సాంఘిక సంక్షేమ, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి డి.దుర్గాబాయి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు, డి.ఎస్.పిలు, కమిటీ సభ్యులు అనురాధ, గుడెపు అశ్వినీ కుమార్, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

## గో సంఘంలో వేమూరి ట్రస్ట్ సేవలు అభినందనీయం



**మచిలీపట్నం,పెన్ పవర్ సెప్టెంబర్ 19**

చింతకుంటపాలెంలోని గో సంరక్షణ కేంద్రంలో వేమూరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రూ.10 వేల విలువైన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, దాణాను ఆవులకు మేతగా అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ వేమూరి రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులు, పేదలకు సేవలతో పాటు గో సంరక్షణకు కూడా సహకరిస్తున్నట్లు రమేష్ తెలిపారు.మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ చింతకుంటపాలెం గో సంరక్షణ కేంద్రంలో సుమారు 200 ఆవులను పోషించడం అభినందనీయమన్నారు. అయితే కేంద్రం పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఎస్పీని కోరారు. చందమామ బాబు మాట్లాడుతూ మూగజీవాలకు ఆహారం అందించడం మాధవ సేవతో సమానమన్నారు.గో సంఘం ప్రధాన కార్యదర్శి పల్లపోతు సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ తటవర్తి వంశీకులు 59 ఎకరాలను గో సంఘానికి కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో గుడివాడ ప్రసాద్, ఓలేటి చంద్రశేఖర్, మాగంటి రమణ, వేమూరి రత్నగిరి, మాటూరి రాజేష్, అన్నం బాబురావు, లంకిశెట్టి దీపక్, పెన్నేరు దేవాన్ష్ తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడలో ఘనంగా 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ






**విజయవాడ, పెన్ పవర్, సెప్టెంబర్, 19,**

ఆయుర్వేదం కేవలం వైద్యం మాత్రమే కాదని.. ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అందించే భారతీయ ప్రాచీన విజ్ఞాన సంపద అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా విజయవాడ కలెక్టరేట్ వద్ద 'ఆరోగ్యకర భవితకు ఆయుర్వేదం' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ లక్ష్మీశ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమతుల్య ఆహారం, క్రమబద్ధమైన జీవనశైలి, ప్రకృతితో అనుసంధానంగా జీవించడం వంటి అంశాలకు ఆయుర్వేదం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మారుతున్న జీవనశైలి కారణంగా ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.ఆయుర్వేదంలోని ఆరోగ్య సంరక్షణ సూత్రాలు, ఆహార నియమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్యవంతమైన ప్రజలే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అని.. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ఆయుర్వేదానికి తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ వై. రత్న ప్రియదర్శిని, ఆయుర్వేద కళాశాల, ఆసుపత్రి వైద్యాధికారులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు సి.పి.ఐ.

**గుంటూరు,పెన్ పవర్,సెప్టెంబర్ 19:**

గుంటూరు నగర సమితి ఆధ్వర్యంలో సురక్ష హాస్పిటల్స్, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో అశోక్‌నగర్‌లోని ఎర్రజెండా సెంటర్‌లో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. నిరుపేదలకు భారంగా మారుతున్న వైద్య ఖర్చులను దృష్టిలో ఉంచుకుని ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సిపిఐ గుంటూరు నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ తెలిపారు. శిబిరంలో చిన్నపిల్లలు, మహిళలు, ఎముకలు, కీళ్లు, నరాలు, జాయింట్ రీప్లేస్‌మెంట్, క్రిటికల్ కేర్, మానసిక ఆరోగ్యం తదితర విభాగాల్లో వైద్యులు పరీక్షలు నిర్వహించారు. శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి శుక్లాల ఆపరేషన్లు ఉచితంగా చేయడంతో పాటు కళ్లజోళ్లను తక్కువ ధరలకు అందించే ఏర్పాట్లు చేశారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సి.పి.ఐ. జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరావు, సి.పి.ఐ. జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఇటువంటి శిబిరాలు మరిన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సురక్ష హాస్పిటల్ చిన్నపిల్లల వైద్య




నిపుణులు డా. ప్రగతి రెడ్డి పోశం మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. హైకోర్టు అడ్వకేట్ గుడిసేవ హరగోపాల్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు కల్పించేందుకు చేపట్టిన కార్యక్రమాన్ని అభినందించారు.

శిబిరానికి అశోక్‌నగర్, పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. అనంతరం ఈ స్థానిక సిపిఐ శాఖా కార్యదర్శి ఆకిటి రామచంద్రుడు ముగించారు.

## బోయి భీమన్న సాహిత్యం సమాజంలో చైతన్యం నింపింది మంత్రి దుర్గేష్





**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 19:**

మహాకవి, పద్మభూషణ్ బోయి భీమన్న రచనలు సమాజంలో స్ఫూహ, చైతన్యాన్ని రగిలించాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాష్ట్రంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. విజయవాడ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో శనివారం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బోయి భీమన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంత్రి కందుల దుర్గేష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ముఖ్యఅతిథులుగా హాజరై భీమన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా గుంటూరు జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత, సాహితీవేత్త భూసురపల్లి వెంకటేశ్వర్లుకు బోయి భీమన్న అవార్డు--2026'ను మంత్రి దుర్గేష్ ప్రదానం చేశారు. జ్ఞాపిక, శాలువాతో పాటు రూ.2 లక్షల నగదు పారితోషికాన్ని అందజేసి సత్కరించారు.

భీమన్న భౌతికంగా మన మధ్య లేకపోయినా తన రచనల ద్వారా అమరుడయ్యారని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. నేటి తరానికి మహామహుల రచనలను అందించి సామాజిక వికాసానికి దోహదపడతామని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న బోయి భీమన్న కళాపీఠాన్ని రాజమహేంద్రవరంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.

అలాగే అర్హులైన కళాకారులందరికీ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో త్వరలో గుర్తింపు కార్డులు అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు.

కార్యక్రమంలో బోయి హైమావతి, నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, అధికార భాషా సంఘం అధ్యక్షులు పూల త్రివిక్రమరావు, సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, సాంస్కృతిక శాఖ అధికారులు, పలువురు రచయితలు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

## నరసరావుపేటలో వినాయక పందిళ్లను సందర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు పలు ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు.. నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే





**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 19:**

నరసరావుపేట పట్టణంలో శనివారం నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించారు. ఆయా మండపాల్లో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమూల్య నర్సింగ్ హోమ్, గడియార స్థంభం సెంటర్, మహాత్మా గాంధీ క్లాత్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, స్థానికులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అరవింద బాబు పాల్గొన్నారు. వినాయక ఊరేగింపు ట్రాక్టర్ నడిపారు. భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాలను ఆయన పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, భక్తి వాతావరణంలో కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతతోనే ఆరోగ్యకర సమాజం

## ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలి

**సమిష్టి కృషితో స్వచ్ఛ చీరాల సాధ్యం: ఎమ్మెల్యే మాలకొండయ్య**




**చీరాల, సెప్టెంబర్ 19 (పెన్ పవర్):**
రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చీరాలలోని చిన్నపిల్లల పార్క్‌లో శనివారం స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పాల్గొని పరిసరాలను పరిశుభ్రం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిశుభ్రమైన పరిసరాలతోనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమన్నారు. స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు. ఇళ్లు, వీధులు, పార్కుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమిష్టిగా కృషి చేస్తే స్వచ్ఛ చీరాలను సాధించవచ్చని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పేర్కొన్నారు.

## ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శిగా జరుబుల శ్రావణి ఎంపిక

## 2026–27 విద్యా సంవత్సరానికి బాధ్యతలు చేపట్టనున్న వేటపాలెం పీఈటీ





**-సత్కరించిన ప్రధానోపాధ్యాయిని -- హర్షం వ్యక్తం చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు**

**వేటపాలెం, సెప్టెంబర్ 19 (పెన్ పవర్):**
2026–27 విద్యా సంవత్సరానికి బాపట్ల జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) జిల్లా కార్యదర్శిగా వేటపాలెం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న జరుబుల శ్రావణి ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి. శ్రీనివాస్ సింగ్ శుక్రవారం ధ్రువీకరించారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయిని దేవరకొండ సరోజిని శనివారం వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని శ్రావణిని ఘనంగా సత్కరించి అభినందించారు. పాఠశాల స్టాఫ్ సెక్రటరీ కె. సోమశేఖర్, పీడీ జె. దేవబిక్షం, ఇతర ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు, విద్యార్థులు జరుబుల శ్రావణి ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆమె పదవీకాలంలో జిల్లా స్థాయిలో క్రీడా అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

## ప్రజలకు--ప్రభుత్వానికి వారధిగా తెలుగుయువత రావిపాటి సాయి కృష్ణ



**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 19:**
కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో తెలుగుయువత వారధిగా క్రియాశీలకంగా పనిచేయాలని కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు. తెలుగుదేశం పార్టీ యువ విభాగం ద్వారా ఉత్తమ ప్రతిభ కనబరిచిన గుంటూరు జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయి కృష్ణను ఆయన అభినందించారు.
తెలుగుదేశం పార్టీ కార్యకలాపాలను ప్రజలకు చేరువ చేయడంలో రావిపాటి సాయి కృష్ణ అందించిన సేవలను గుర్తిస్తూ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ పంపిన పార్టీ గుర్తుతో కూడిన జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని జిల్లా పార్టీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేతుల మీదుగా సాయి కృష్ణకు అందజేశారు.
ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ యువనేత నారా లోకేష్ ఆలోచనతో రూపొందించిన మై టీడీపీ అనువర్తనం ద్వారా అందుతున్న తక్షణ సమాచారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ సేవలకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయాలని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న సేవలను అనువర్తనంలో నమోదు చేయడం ద్వారా వారి పనితీరుపై పార్టీ అధిష్టానానికి సమాచారం చేరుతుందని తెలిపారు. దీనివల్ల నాయకులు, కార్యకర్తల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.
రావిపాటి సాయి కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు పరిచయం చేయడంతో పాటు పార్టీ శ్రేణులను కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తున్నట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తల పాత్ర కీలకమన్నారు. తన సేవలను గుర్తించి నారా లోకేష్ ప్రశంసాపత్రం, జ్ఞాపిక పంపడం మరింత ఉత్సాహంతో పార్టీ కోసం పనిచేయడానికి ప్రోత్సాహాన్ని ఇచ్చిందని సాయి కృష్ణ ఆనందం వ్యక్తం చేశారు

## పోషకాహారంతోనే రక్తహీనతకు చెక్






**దేశాయిపేట, సెప్టెంబర్ 19 (పెన్ పవర్) :**
వేటపాలెం మండలం, దేశాయిపేట సెక్టార్‌లోని నీలకంఠపురం అంగన్‌వాడీ కేంద్రం వద్ద పోషణ మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సూపర్‌వైజర్ ఎస్. లీలావతి పాల్గొని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సమతుల ఆహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు.
రక్తహీనతను నివారించేందుకు అధిక పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు, మినరల్స్, ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. గర్భిణుల నుంచి ఆరేళ్లలోపు పిల్లల వరకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.
అంగన్‌వాడీ కేంద్రంలోని పోషణ వాటికలో ఆకుకూరలు, మునగ, కరివేపాకు, వంకాయ, చిక్కుడు తదితర కూరగాయలను పెంచుతూ, వాటిని చిన్నారుల పోషకాహారంలో వినియోగిస్తున్నట్లు వివరించారు.
ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

## గో సంఘంలో వేమూరి ట్రస్ట్ సేవలు అభినందనీయం



**మచిలీపట్నం,పెన్ పవర్ సెప్టెంబర్ 19**
చింతకుంటపాలెంలోని గో సంరక్షణ కేంద్రంలో వేమూరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రూ.10 వేల విలువైన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, దాణాను ఆవులకు మేతగా అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ వేమూరి రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులు, పేదలకు సేవలతో పాటు గో సంరక్షణకు కూడా సహకరిస్తున్నట్లు రమేష్ తెలిపారు.మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ చింతకుంటపాలెం గో సంరక్షణ కేంద్రంలో సుమారు 200 ఆవులను పోషించడం అభినందనీయమన్నారు. అయితే కేంద్రం పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఎస్పీని కోరారు. చందమామ బాబు మాట్లాడుతూ మూగజీవాలకు ఆహారం అందించడం మాధవ సేవతో సమానమన్నారు.గో సంఘం ప్రధాన కార్యదర్శి పల్లపోతు సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ తటవర్తి వంశీకులు 59 ఎకరాలను గో సంఘానికి కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో గుడివాడ ప్రసాద్, ఓలేటి చంద్రశేఖర్, మాగంటి రమణ, వేమూరి రత్నగిరి, మాటూరి రాజేష్, అన్నం బాబురావు, లంకిశెట్టి దీపక్, పెన్నేరు దేవాన్ష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రలో ప్రజల భాగస్వామ్యం పెరగాలి : ప్రత్తిపాటి

## చిలకలూరిపేట పట్టణంలోని మార్కెట్ వద్ద ఉన్న చెత్తను తొలగించిన ప్రత్తిపాటి

**-పారిశుధ్య కార్మికులతో కలిసి వ్యర్థాలు తొలగించి, వారితో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించిన ఎమ్మెల్యే**






**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 19 :**
ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక గొప్ప ఆశయంతో చేపట్టిన స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం విజయవంతంలో ప్రజల భాగస్వామ్యం పెరగాలని, ప్రజా చైతన్యమే సమాజాన్ని, రాష్ట్రాన్ని శుభ్రపరుస్తుందని శాసనసభ్యులు ప్రత్తిపాట పుల్లారావు పేర్కొన్నారు.
ప్రతి నెలా మూడో శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన పారిశుధ్య కార్మికులతో కలిసి చిలకలూరిపేట పట్టణంలోని మార్కెట్ వద్ద ఉన్న చెత్తను తొలగించారు. కుప్పలుగా వేసిన కూరగాయలు, పండ్ల వ్యర్థాలను స్వయంగా తొలగించిన ప్రత్తిపాటి..అనంతరం ప్రజలు, పారిశుధ్య కార్మికులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

**చంద్రబాబు చేపట్టి ప్రతి కార్యక్రమంలో, ప్రజా ప్రయోజనాలు, రాష్ట్రాభివృద్ధి.**

అభివృద్ధి, సంక్షేమంతో పాటు.. ప్రజా రోగ్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాముఖ్యత ఇస్తున్నారని, దానిలో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తూ, ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. చంద్రబాబు చేపట్టి ప్రతి కార్యక్రమం.. ప్రతి ఆలోచనలో ప్రజల ప్రయోజనాలు, రాష్ట్రాభివృద్ధి ముడిపడి ఉంటాయని, దానికి ప్రత్యక్ష నిదర్శనమే స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమమని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. తమ నివాసాలతో పాటు.. చుట్టూ ఉండే పరిసరాలు, రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రజల కనీస బాధ్యతని, దానిపై వారు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ప్రత్తిపాటి సూచించారు.
కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు కొత్త కోటేశ్వరరావు, ముల్లా కరిముల్లా, మురకొండ మల్లిబాబు, పిల్లి కోటేశ్వరరావు, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, నెల్లూరి రంజిత్, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, టీడీపీ నాయకులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా క్రికెట్ ప్రతిభకు వేదికగా విమెన్ ఏపీఎల్ -- తొలి మ్యాచ్‌కు టాస్ వేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి





**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 19,**
మంగళగిరిలో మహిళల ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (విమెన్ ఏపీఎల్) టీ20 క్రికెట్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నాలుగు జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో మొత్తం 13 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. తొలి మ్యాచ్‌కు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి టాస్ వేసి పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ మహిళా క్రికెటర్ల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ చేపట్టిన విమెన్ ఏపీఎల్ అభినందనీయమన్నారు. పురుషుల క్రికెట్‌కు ఏమాత్రం తీసిపోని విధంగా ఈ టోర్నీని రూపకల్పన చేశారని, క్రీడాకారిణులకు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఇది గొప్ప వేదికగా నిలుస్తుందని తెలిపారు.
టోర్నీకి సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయని, ప్రేక్షకులకు అద్భుతమైన క్రీడానుభూతిని అందించేలా అన్ని మ్యాచ్‌లను డే అండ్ నైట్ విధానంలో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహిస్తున్నారని చెప్పారు.
మహిళలను క్రీడల్లో మరింతగా ప్రోత్సహించడం, మహిళా సాధికారతను బలోపేతం చేయడమే విమెన్ ఏపీఎల్ ప్రధాన లక్ష్యమన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దాగి ఉన్న మహిళా క్రీడా ప్రతిభను వెలికితీసి రాష్ట్రానికి, దేశానికి మంచి క్రీడాకారిణులను అందించడంలో ఈ లీగ్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.
అలాగే మంగళగిరి ఏసీఏ క్రికెట్ స్టేడియం అభివృద్ధికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన సహకారంతో స్టేడియం ఆధునికీకరణ, ఫ్లడ్‌లైట్లు, ప్రేక్షకుల సౌకర్యాలు, మౌలిక వసతుల అభివృద్ధి పనులు వేగంగా పూర్తయ్యాయని, ప్రస్తుతం రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి టోర్నీల నిర్వహణకు మంగళగిరి ప్రధాన వేదికగా ఎదుగుతోందన్నారు.

## ఇంటి నుంచే పరిశుభ్రత మొదలవ్వాలి జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి




**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 19,**
పరిశుభ్రత అనేది మన జీవితంలో ఒక ప్రధాన భాగం కావాలని , స్వచ్ఛత అనేది దైవత్వంతో సమానమని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని ప్రజలందరి భాద్యత అని అయన అన్నారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా శ్రీనివాసరావుతోటలో పరిసరాల పరిశుభ్రతపై స్థానిక శానిటరీ ఇన్స్పెక్టర్ పాపారావు ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. తడి చెత్త , పొడి చెత్త , శానిటరీ వేస్ట్ , ఈ వేస్ట్ లపై ప్రజలకు , విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ పరిశుభ్రత అనేది ఇంటి నుంచే మొదలవ్వాలన్నారు. మన ఇల్లు బాగుంటే మన వీధి బాగుంటుంది, తద్వారా మన ఊరు బాగుంటుంది దీంతో మన రాష్ట్రమే పరిశుభ్రంగా ఉంటుందన్నారు. గత ప్రభుత్వం చెత్త మీద పన్ను వసూలు చేశారు కానీ పరిసరాలను శుభ్రం మాత్రం చేయలేదని విమర్శించ్చారు. కూటమి ప్రభుత్వం మాత్రం పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ కోసం నిరంతరం శ్రమిస్తుందని కొనియాడారు. తమ ఆరోగ్యాన్ని , ప్రాణాలను ఫణంగా పెట్టి సమాజంలోని చెత్తను తొలగించే పారిశుధ్య కార్మికులకు యావత్ ప్రజానీకం రుణపడి ఉంటుందన్నారు. పరిశుభ్ర గుంటూరు సాధనే లక్ష్యంగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ , గుంటూరు పశ్చిమ శాసనసభ్యురాలు గళ్ళా మాధవి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని ఆళ్ళ హరి అన్నారు. తొలుత విద్యార్థులతో , ప్రజలతో స్వచ్ఛంధ్రా స్వర్ణాంధ్ర ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ డివిజన్ అధ్యక్షులు చింతకాయల వెంకట సాయి , బీజేపీ సీనియర్ నాయకులు అప్పిశెట్టి రంగా , సచివాలయం సిబ్బంది మల్లేశ్వరి , కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 27న ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం కలెక్టర్ డా. జి. లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 19: ప్రపంచ**
పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27న ఎన్టీఆర్ జిల్లాలో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. డా. బి.ఆర్. అంబేద్కర్ స్మృతి వనం, జిల్లా కలెక్టరేట్, రాఘవయ్య పార్క్‌లలో వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.జిల్లా పర్యాటక వైభవాన్ని చాటడంతో పాటు విద్యార్థులు, యువతను పర్యాటక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సంప్రదాయ వస్త్రధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ కళారూపాల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.
24న ప్రతిభా ఎంపికలుసాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ వస్త్రధారణ, ఇతర ప్రదర్శనల్లో పాల్గొనాలనుకునే విద్యార్థులకు ఈ నెల 24న మధ్యాహ్నం 3 గంటలకు డా. బి.ఆర్. అంబేద్కర్ స్మృతి వనం వద్ద ఎంపిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికలో ప్రతిభ కనబరిచిన వారికి 27న జరిగే ప్రధాన కార్యక్రమంలో ప్రదర్శనకు అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.
పర్యాటక, చారిత్రక, సాంస్కృతిక వారసత్వ ప్రదేశాలకు సంబంధించిన చిత్రాలు, కళాఖండాలు, సంప్రదాయ వస్తువులు, క్యూ ర్ కోడ్‌లతో కూడిన సమాచార స్టాళ్లను ఏర్పాటు చేసేందుకు విద్యార్థులు, సంస్థలు ముందుకు రావాలని కోరారు. అలాగే ఎన్టీఆర్ జిల్లా సంప్రదాయ ఆహార సంస్కృతిని పరిచయం చేసే విధంగా సంప్రదాయ వంటకాల స్టాళ్ల ఏర్పాటుకు ఆసక్తి ఉన్నవారు పాల్గొనవచ్చని జిల్లా పర్యాటక అధికారి డా. కొల్లేటి రమేష్ తెలిపారు.
యువత, విద్యార్థులు, స్థానిక సమాజం భాగస్వామ్యంతో జిల్లాలోని ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతిక, వారసత్వ పర్యాటక ప్రాంతాలకు మరింత ప్రచారం కల్పించవచ్చని ఆయన పేర్కొన్నారు.ఎంపిక వేదిక: డా. బి.ఆర్. అంబేద్కర్ స్మృతి వనం, విజయవాడ
తేదీ: సెప్టెంబర్ 24, 2026సమయం: మధ్యాహ్నం 3 గంటలుసంప్రదించవలసిన వారు: జిల్లా పర్యాటక అధికారి డా. కొల్లేటి రమేష్ 94879 16504

## ఉపాధ్యాయ ఎం.ఎల్.సీ ఓటరుగా కొత్తగా నమోదు తప్పనిసరి రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి



**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 19:**
ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు ఉపాధ్యాయులు తప్పనిసరిగా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి తెలిపారు. గత ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. ఈ నెల 28న ఓటరు నమోదు కార్యక్రమంపై బహిరంగ నోటీసు విడుదల చేస్తామని, నవంబర్ 6 వరకు ఫారం–19 దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. నవంబర్ 25న ముసాయిదా జాబితా, డిసెంబర్ 30న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని వెల్లడించారు.ఎస్ఐఆర్‌లో భాగంగా జిల్లాలో 1,68,220 నోటీసులు జారీ చేయగా, 1,094 విచారణలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు.

# చెత్త రహిత ఉప్పుటూరే లక్ష్యం.. స్వచ్ఛతపై అధికారుల పిలుపు!

## డెంగ్యూ, మలేరియాకు చెక్ పెట్టేందుకు ప్రతి ఇంటా పరిశుభ్రత పాటించాలి

**తడి--పొడి చెత్త వేరు చేయాలి.. ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలకాలి**



**ఉప్పుటూరు, సెప్టెంబర్ 19 (పెన్ పవర్):**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఉప్పుటూరు గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, వ్యాధుల రహితంగా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా గ్రామస్తులకు పలు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత లోపిస్తే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి గ్రామ పరిశుభ్రతలో పంచాయతీ సిబ్బందికి సహకరించాలని సూచించారు. ఇళ్లలో ఉత్పత్తయ్యే తడి, పొడి చెత్తను విడివిడిగా భద్రపరిచి పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి మాత్రమే అందించాలని, రోడ్లు, ఖాళీ స్థలాల్లో చెత్త వేయరాదన్నారు.
ఇళ్ల పరిసరాలు, డాబాలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పూలకుండీల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల వృద్ధిని అరికట్టాలని సూచించారు. ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ వస్తువులు, కవర్లను పూర్తిగా నివారించి బట్ట సంచులను ఉపయోగించాలని కోరారు. కాచి చల్లార్చిన నీటిని తాగడంతో పాటు తాగునీటి పాత్రలకు మూతలు పెట్టుకోవాలని, భోజనానికి ముందు, బహిర్భూమి నుంచి వచ్చిన తర్వాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. బహిరంగ మల, మూత్ర విసర్జనను పూర్తిగా నివారించాలని తెలిపారు.
అనంతరం గ్రామస్తులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నీలం వెంకట రామకృష్ణ, పంచాయతీ సిబ్బంది రామారావు, వెంకటేష్, పోతురాజు, రత్నకుమారి, పద్మావతి, సత్య, స్వచ్ఛంద సేవకురాలు కె. నాగరాజా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జీవితాంతం టీడీపీ కోసమే పనిచేసిన నిబద్ధత కలిగిన ప్రజా నాయకుడు గుత్తా : ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎంపీ లావు

## గోవిందాపురంలో టీడీపీ సీనియర్ నాయకులు, దివంగత గుత్తా వెంకటేశ్వర్లు విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రత్తిపాటి, లావు.



**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, సెప్టెంబర్ 19 :**
నియోజకవర్గంలో గుత్తా వెంకటేశ్వర్లు పేరు తెలియని వారు ఉండరని, జీవితాంతం టీడీపీ కోసం నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేసిన నాయకుడు గుత్తా అని, ఆయన మరణం చిలకలూరిపేట తెలుగుదేశానికి తీరని లోటని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.
శనివారం ఆయన ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలుతో కలిసి చిలకలూరిపేట మండలం గోవిందాపురంలో టీడీపీ సీనియర్ నాయకుడు, దివంగత గుత్తా వెంకటేశ్వర్లు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ముందుగా వారి నివాసానికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను ప్రమర్శించి చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించి ప్రత్తిపాటి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.గుత్తా వెంకటేశ్వర్లుని ఆదర్శంగా తీసుకొని, ఆయన నడిచిన మార్గంలో టీడీపీ నాయకులు పార్టీ కోసం పట్టుదలతో పనిచేయాలని ప్రత్తిపాటి సూచించారు. ప్రజలకు అత్యంత ఆప్తులు, స్నేహశీలి, మృదుస్వభావి, నిజాయితీపరుడైన గుత్తా మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నట్టు ప్రత్తిపాటి తెలిపారు. నాయకులు, పార్టీకి సమస్యలు సృష్టించకుండా, ప్రజలకోసం ఆదర్శభావాలతో పనిచేసిన నాయకుడు గుత్తా వెంకటేశ్వర్లని ప్రత్తిపాటి కొనియాడారు.
కార్యక్రమంలో జీ.డి.సి.సి బ్యాంకు మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు, నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు కోడె హనుమంతరావు , రామకోటయ్య, రాఘవయ్య, గోపి , మురకొండ మల్లిబాబు, పిల్లి కోటేశ్వరరావు, అబ్దుల్ ఖుమీర్, సాంబాబు, రవి, నాగభైరు ఆంజనేయులు, కిలారు లక్ష్మీ నారాయణ, టీడీపీ నాయకులు కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు సీఎంఆర్ఎఫ్ అండ : ఎమ్మెల్యే ఏలూరి

## 131 మందికి రూ.56.48 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**పర్చూరు, సెప్టెంబర్ 19 (పెన్ పవర్):**
ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందనిపర్చూరుఎమ్మెల్యేఏలూరిసాంబశివరావు అన్నారు. పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మానవతా దృక్పథంతో వైద్య ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నారని పేర్కొన్నారు.
శుక్రవారం పర్చూరులో 131 మంది లబ్ధిదారులకు రూ.56,48,356 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్టేట్ మైనారిటీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ముస్తాక్ అహ్మద్‌తో కలిసి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణం ఎంతో విలువైనదని,కుటుంబసభ్యులను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ఎంతటి కష్టాన్నైనా భరించేందుకు సిద్ధపడతారని అన్నారు. అదే విధంగా కష్టకాలంలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం కుటుంబ సభ్యుడిలా అండగా నిలిచి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు.

**24 నెలల్లో రూ.21 కోట్లకు పైగా సాయం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 24 నెలల్లో పర్చూరు నియోజకవర్గంలో సుమారు



3,500 కుటుంబాలకు రూ.21 కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందించినట్లు ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. 2014--19 మధ్య కాలంలో సుమారు రూ.12 కోట్ల సీఎంఆర్ఎఫ్ నిధులు అందగా.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఇప్పటివరకు రూ.21 కోట్లకు పైగా సాయం అందించినట్లు వివరించారు.

**రాజకీయాలకు అతీతంగా సంక్షేమం**

కష్టాల్లో ఉన్న రైతులు, కూలీలు, పేదలకు ఎలాంటి సిఫార్సులు, రాజకీయ ప్రమేయం లేకుండా సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందిస్తున్నామని ఏలూరి పేర్కొన్నారు. ఓటు వేశారా? లేదా? ఏ పార్టీకి మద్దతు ఇచ్చారు? అనే అంశాలతో సంబంధం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందిస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ ప్రభుత్వం న్యాయం చేస్తోందన్నారు.

**యూనివర్సల్ హెల్త్ స్కీమ్ దిశగా అడుగులు**

పేదల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పించేందుకు యూనివర్సల్ హెల్త్ స్కీమ్ ఏర్పాటు దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు చేపడుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూనే ప్రజలకు అవసరమైన సమయంలో సహాయం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.
ప్రభుత్వాన్ని నడిపే వ్యక్తికి ప్రజలకు మేలు చేయాలనే సంకల్పం ఉంటేనే సంక్షేమం సాధ్యమవుతుందని, పేదలకు మేలు చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం పనిచేస్తున్నారని ఏలూరి సాంబశివరావు అన్నారు.

# అత్యుత్తమ వైద్యసేవలతో ప్రజారోగ్యరక్షణలో అగ్రస్థానంలో నిలవాలి : ప్రత్తిపాటి

## ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉత్తమ పనితీరు చూపండి.

**నియోజకవర్గ స్థాయి వైద్యారోగ్య శాఖ సమీక్ష సమావేశంలో ప్రత్తిపాటి.**



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 19 :**
ప్రజారోగ్య పరిరక్షణకోసం వైద్యారోగ్య శాఖ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని, ప్రభుత్వ వైద్యసేవలఅందించడంలో ఉత్తమ పనితీరు కనబరిచి,నియోజకవర్గాన్నిరాష్ట్రంలోనేఅగ్రస్థానంలో నిలపాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చిలకలూరిపేట వైద్యారోగ్య శాఖ యంత్రాంగానికి సూచించారు.
శనివారం సాయంత్రం స్థానిక ప్రత్తిపాటి గార్డెన్స్ లో జిల్లావైద్యారోగ్య అధికారి మన్మోహన్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా వైద్యధికారులందరితో జరిగిన నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో ప్రత్తిపాటి మాట్లాడారు.

**అత్యుత్తమ వైద్యసేవలతోనే ప్రజలకు మెరుగైన ఆరోగ్యం.**

ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యుత్తమ వైద్యసేవలు అందినప్పుడే ప్రజలకు మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ఈ దిశగా నియోజకవర్గ వైద్యారోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు కృషి చేయాలని ప్రత్తిపాటి సూచించారు. స్థానికంగా ఉన్న కాటన్ పరిశ్రమల్లో ఉపాధి కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు చిలకలూరిపేటలో అధికంగా ఉన్నారని, వారందరి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని సంపూర్ణ వివరాలు సేకరించాలని ఎమ్మెల్యే వైద్యారోగ్య సిబ్బందిని ఆదేశించారు. హెచ్.ఐ.వీ, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారి ఆరోగ్యరక్షణలో నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. పేదల ఆరోగ్య రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఎన్టీఆర్ వైద్యసేవ పథకాన్ని సక్రమంగా వినియోగించాలని ఆయన సూచించారు. కొన్ని నెట్ వర్క్ ఆసుపత్రులు ఎన్టీ ఆర్ వైద్య సేవ పథకం లబ్ధిని పొందుతూనే, అదనంగా రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని, అలాంటి చర్యలను ఎవరూ సమర్థించవద్దని ఎమ్మెల్యే స్పష్టంచేశారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంజీని ప్రాజెక్ట్ ను నియోజకవర్గంలో సమగ్రంగా అమలు చేయాలని, వైద్యవిభాగం అధికారులు, సిబ్బంది ఉత్తమ పనితీరుతో ప్రజలకు చేరువ కావాలని ప్రత్తిపాటి సూచించారు. 108, 104 విభాగాల పనితీరు మెరుగుపడాలని, తల్లీ బిడ్డ ఎక్స్ ప్రెస్ సేవలపై ప్రజల సంతృప్తిస్థాయి పెరగాలని ఆయన సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులకు అందించే ప్రభుత్వ వైద్య సేవలు మెరుగుపడాలన్నారు.
సమీక్ష సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, జిల్లా వైద్యాధికారులు చంద్రశేఖర్, మాధవి లత, హనుమ, మురళీకృష్ణ, డాక్టర్లు, నర్సులు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల మేరకే నూతన పింఛన్ల మంజూరు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 19:**
జిల్లాలో నూతనంగా దరఖాస్తు చేసుకున్న పింఛన్లను ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత అర్హతల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారికి మాత్రమే మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.
శనివారం విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు--2 కార్యాలయంలో నూతన పింఛన్ల ఆన్‌లైన్ ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. దరఖాస్తుల నమోదు, అర్హతల పరిశీలన, వివరాల నమోదు తదితర అంశాలాపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.దరఖాస్తుదారుల అర్హతలను సంబంధిత రికార్డులతో సరిచూసిన అనంతరం మాత్రమే పింఛన్ మంజూరు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. అర్హత లేని వారికి పింఛన్లు మంజూరు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా అధికారులుసమన్వయంతోపనిచేయాలని తెలిపారు. నూతన పింఛన్లకు సంబంధించి సెప్టెంబర్ 21లోగా భౌతిక పరిశీలన, సెప్టెంబర్ 24లోగా తదుపరి ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పింఛన్ల మంజూరులో పారదర్శకత, నిబంధనల అమలు, అర్హతల ఖచ్చితమైన నిర్ధారణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు.కార్యక్రమంలో స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి కె.ఆర్.ఎస్.ఆర్. రవికుమార్, పంచాయతీ కార్యదర్శి, ఆధార్ కోఆర్డినేటర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నరసరావుపేటలో వినాయక పందిళ్లను సందర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు

## పలు ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు.. నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే






**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 19:**
నరసరావుపేట పట్టణంలో శనివారం నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించారు. ఆయా మండపాల్లో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమూల్య నర్సింగ్ హోమ్, గడియార స్థంభం సెంటర్, మహాత్మా గాంధీ క్లాత్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, స్థానికులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అరవింద బాబు పాల్గొన్నారు. వినాయక ఊరేగింపు ట్రాక్టర్ నడిపారు. భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాలను ఆయన పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, భక్తి వాతావరణంలో కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

# వాతావరణ నష్టాల నుంచి గట్టెక్కాలంటే పామాయిల్ సాగు మేలు

వాతావరణ నష్టాల నుంచి గట్టెక్కాలంటే పామాయిల్ సాగు మేలు



రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలి: ఎమ్మెల్యే బోడె ప్రసాద్



**పెన్ పవర్, కృష్ణాజిల్లా, పెనమలూరు, సెప్టెంబర్ 19:**
మారుతున్న వాతావరణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతాంగానికి ఎదురవుతున్న పంట నష్టాలను పూర్తిగా భర్తీ చేయడం ఏ ప్రభుత్వానికైనా సవాలుగా మారుతోందని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయ పంటగా పామాయిల్ సాగు వైపు దృష్టి సారించాలని సూచించారు. కంకిపాడు మండలం మద్దూరులో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా ఆయిల్‌ఫామ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్లు, అధిక వర్షాలు, వరదల వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.
అరటి, పసుపు, కంద, మొక్కజొన్నతో పాటు వరి పంటలు కూడా వాతావరణ మార్పుల ప్రభావానికి గురవుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా కృష్ణాజిల్లాలోని కంకిపాడు, ఉయ్యూరు, పామర్రు వంటి లోతట్టు ప్రాంతాలు అధిక వర్షాల సమయంలో తరచూ ముంపునకు గురవుతున్నాయని అన్నారు.
వరి సాగుకు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టిన అనంతరం పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్లు, భారీ వర్షాలు సంభవిస్తే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పంట బీమా ఉన్నప్పటికీ కొన్ని సందర్భాల్లో నష్టాన్ని పూర్తిగా భర్తీ చేయడం సాధ్యం కావడం లేదన్నారు.

**పామాయిల్ సాగుతో ప్రయోజనాలు**

పామాయిల్ తోటలు తుఫాన్లు, ఈదురుగాలులను తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటాయని బోడె ప్రసాద్ తెలిపారు. వరద నీరు వారం, పది రోజుల పాటు తోటల్లో నిలిచినా చెట్లకు పెద్దగా నష్టం వాటిల్లదని పేర్కొన్నారు. చేతికొచ్చిన పామాయిల్ పంట వర్షానికి తడిసినా ఇతర పంటల మాదిరిగా పాడయ్యే అవకాశం తక్కువగా ఉంటుందని చెప్పారు.
వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల వైవిధ్యాన్ని పెంచుకోవాలని, దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే పామాయిల్ సాగుపై ఉద్యానశాఖ అధికారుల సూచనలు తీసుకుని ముందుకు సాగాలని ఎమ్మెల్యే సూచించారు.

# ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలోవిద్యార్థులకు విజిలెన్స్‌పై అవగాహన





**విజయవాడ , పెన్ పవర్,సెప్టెంబర్, 19,**
విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్--2026ను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, ఉయ్యూరు శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉయ్యూరులోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు విజిలెన్స్, నిజాయితీ, సమగ్రత (ఇంటిగ్రిటీ) ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిది ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ విజిలెన్స్ ఇన్‌చార్జి బి. హరీష్ మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విజిలెన్స్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో నిజాయితీ, నైతిక విలువలను పాటిస్తూ సమగ్రతను పెంపొందించుకోవాలని సూచించారు. అవినీతి నిరోధక చర్యల్లో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు తమవంతు బాధ్యతను నిర్వర్తించాల్సిన అవసరాన్ని వివరించారు.
ఈ సందర్భంగా నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ క్రీడా పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.
ఈ కార్యక్రమంలో గుడివాడ రీజినల్ మేనేజర్ కె. ఆంజనేయులు, జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రిన్సిపల్ టి. నాగేశ్వరరావు, రీజినల్ ఆఫీసర్ జగదీష్, ఉయ్యూరు బ్రాంచ్ మేనేజర్ కె. భావన తదితరులు పాల్గొన్నారు.

# పెడనలో సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన

**పెడన, పెన్ పవర్,సెప్టెంబర్ 19**
పెడనలో రైతులకు సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంపై మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. రైతులకు 100 శాతం రాయితీపై బ్రోమోడైలోన్ ఎలుకల మందును పంపిణీ చేశారు. విషపు ఎర తయారీ విధానాన్ని వ్యవసాయ సిబ్బంది ప్రత్యక్షంగా చేసి చూపించారు. 100 గ్రాముల విషపు ఎర తయారీకి 96 గ్రాముల నూకలు, రెండు గ్రాముల నూనె, రెండు గ్రాముల బ్రోమోడైలోన్ మందు కలపాలని సూచించారు. తయారు చేసిన ఎరను 10 గ్రాముల చొప్పున పొట్లాలుగా కట్టి ఎలుకల బొరియల వద్ద ఉంచాలని వివరించారు. తొలిరోజు పొలాలు, గట్లు, పోరంబోకు భూముల్లోని బొరియాలను మట్టితో మూసివేసి, రెండో రోజు తెరుచుకున్న బొరియాలను సజీవ ఎలుకల బొరియలుగా గుర్తించి ఎర వేయాలని సూచించారు. మందు తీసుకున్న రెండు నుంచి నాలుగు రోజుల్లో అంతర్గత రక్తస్రావం కారణంగా ఎలుకలు మృతి చెందుతాయని మండల వ్యవసాయ అధికారి సజ్జ జెన్నీ తెలిపారు. కార్యక్రమంలో



వ్యవసాయ సహాయకులు ఆర్. సుభాష్, వై. నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

# కరువును అత్యవసర పరిస్థితిగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి




**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 19 :**
రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావం, ఎల్-నినో ప్రభావంతో ఏర్పడిన కరువును 'అత్యవసర పరిస్థితి'గా పరిగణించి రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని సీపీఐ చిలకలూరిపేట ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు డిమాండ్ చేశారు. కరువు కారణంగా 655 మండలాల్లో 80 శాతం ఖరీఫ్ సాగు నిలిచిపోయిందని, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతుల సహాయార్థం రూ. 10 వేల కోట్లతో ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించడంతో పాటు, కరువు మండలాలను గుర్తించి ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, ప్రత్యామ్నాయ పంటలకు ఉచిత విత్తనాలు అందించాలని కోరారు. అలాగే, రైతుల రుణాలను సంపూర్ణంగా మాఫీ చేసి, వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పని దినాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# స్వచ్ఛతలో ముందంజలో నరసరావుపేట
# నరసరావుపేటలో స్వచ్ఛతా హీ సేవా కు శ్రీకారం

**ప్రజా భాగస్వామ్యంతో పరిశుభ్ర పట్టణం దిశగా అడుగులు**
**ప్లాస్టిక్ వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలి**
**నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు**
**అక్టోబర్ 2 వరకు వివిధ కార్యక్రమాలు**

**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 19:**
పరిశుభ్రత, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యాన్ని విస్తృతం చేయడమే లక్ష్యంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి నరసరావుపేటలో శ్రీకారం చుట్టారు. స్థానిక ఏపీజే అబ్దుల్ కలాం పార్క్ వద్ద ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు పట్టణంతో పాటు జిల్లాలోని గ్రామాలు, మున్సిపల్ కేంద్రాల్లో దశలవారీగా వివిధ పారిశుద్ధ్య, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద బాబు మాట్లాడుతూ స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వ శాఖలు, మున్సిపల్ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని ప్రతి పౌరుడు బాధ్యతగా స్వీకరించినప్పుడే సంపూర్ణ పారిశుద్ధ్యం సాధ్యమవుతుందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. గత రెండేళ్లుగా నరసరావుపేట పట్టణంలో మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అయితే మూడు దశాబ్దాల క్రితం ఉన్న స్థాయిలోనే మున్సిపల్ సిబ్బంది ఉండటంతో పాటు కొన్ని పోస్టులు తగ్గిపోవడం వల్ల పారిశుద్ధ్య నిర్వహణలో సిబ్బందిపై అదనపు భారం పడుతోందన్నారు. మున్సిపాలిటీల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసి అవసరమైన మానవ వనరులను సమకూర్చాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు.

**ప్లాస్టిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి**
స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని అరవింద బాబు అన్నారు. ప్లాస్టిక్ బ్యాగులు, ప్లేట్లు, గ్లాసుల వినియోగం కాలువలు, డ్రైనేజీ వ్యవస్థల్లో సమస్యలకు కారణమవుతోందని తెలిపారు. ప్లాస్టిక్ తయారీ, విక్రయ కేంద్రాల వద్ద నుంచే నియంత్రణ చర్యలు




చేపడితే వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.
సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, జిల్లా యంత్రాంగం, మున్సిపల్ అధికారులు కూడా నిబంధనలను కఠినంగా అమలు చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వద్దు--జూట్ వాడదాం వంటి నినాదాలు కేవలం ప్రచారానికే పరిమితం కాకుండా ప్రజల ఆచరణలోకి రావాలని అన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించడం, తడి--పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, వైద్య వ్యర్థాలను ప్రత్యేకంగా నిర్వహించడం వంటి అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, వ్యాపారులు, ప్రజా సంఘాలు, స్థానిక సంస్థలు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

**విద్యార్థులతో అవగాహన కార్యక్రమాలు**

స్వచ్ఛ పాఠశాల--ఆరోగ్యవంతమైన విద్యార్థులు, పరిశుభ్రమైన సమాజం--అభివృద్ధి చెందిన భారత్ అనే నినాదంతో పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని అధికారులు సూచించారు. పాఠశాల ప్రాంగణాలు, తరగతి గదులు, క్రీడా మైదానాలు, తాగునీటి ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని తెలిపారు. పరిశుభ్రత, పర్యావరణ




పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, స్వచ్ఛత జ్ఞానయాత్రలు, చర్చా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక కార్యాచరణ**
మున్సిపాలిటీ కమిషనర్ రమ్య కీర్తన మాట్లాడుతూ సెప్టెంబర్ 17--18 తేదీల్లో స్వచ్ఛ పాఠశాల--యువ ఫర్ స్వచ్ఛత కార్యక్రమాల కింద విద్యార్థులకు వ్యర్థాల విభజన, వర్షపు నీటి సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారు. సెప్టెంబర్ 19--20 తేదీల్లో అపరిశుభ్ర ప్రాంతాలను గుర్తించి శుభ్రపరచడంతో పాటు టార్గెట్ యూనిట్ల సుందరీకరణ చేపట్టనున్నారు. సెప్టెంబర్ 21--22 తేదీల్లో బస్టాండ్లు, మార్కెట్లు, ఆసుపత్రులు, నీటి వనరులు, పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు.
సెప్టెంబర్ 23--24 తేదీల్లో డోర్--టు--డోర్ అవగాహన, నాలుగు రకాలుగా వ్యర్థాల వేర్పాటు, ఇంటి వద్ద కంపోస్టింగ్, గుడ్డ సంచుల వినియోగంపై ప్రచారం చేపట్టనున్నారు. సెప్టెంబర్ 25--26 తేదీల్లో వినాయక నిమజ్జనం అనంతరం ఘాట్ల పరిశుభ్రత, క్రీడా మైదానాల్లో జీరో--వేస్ట్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.
సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని చారిత్రక, పర్యాటక ప్రదేశాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టనున్నారు. సెప్టెంబర్ 28--29 తేదీల్లో వ్యర్థాల నుంచి సంపద కార్యక్రమంలో భాగంగా రీసైక్లింగ్ మేళాలు, వ్యర్థాలతో కళాఖండాల తయారీ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.
సెప్టెంబర్ 30న సఫాయి మిత్ర సురక్షా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, రక్షణ పరికరాలు అందజేయడంతో పాటు వారి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించనున్నారు.
అక్టోబర్ 1న ఏక్ దిన్--ఏక్ ఘంటా--ఏక్ సాత్ కార్యక్రమంలో ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా శ్రమదానం చేయనున్నారు. అక్టోబర్ 2న



స్వచ్ఛ భారత్ దివస్ సందర్భంగా ప్రత్యేక గ్రామసభలు, పట్టణ కౌన్సిల్ సమావేశాలు, అవగాహన ర్యాలీలు, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించనున్నారని తెలిపారు.

**మున్సిపల్ సిబ్బందికి ఎమ్మెల్యే అభినందనలు**
స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని గత రెండేళ్లుగా నరసరావుపేటలో నిరంతరం అమలు చేస్తున్న మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులను ఎమ్మెల్యే అరవింద బాబు అభినందించారు. ప్రజల కోసం రాత్రింబవళ్లు పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించాలని అన్నారు. ప్రజా మరుగుదొడ్లను శుభ్రంగా, సురక్షిత ప్రమాణాలతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పట్టణ పరిశుభ్రతతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పట్టణంలో తాగునీరు, వీధి దీపాలు, విద్యార్థులకు విద్య, యువతకు ఉపాధి వంటి అంశాలపై సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో భాగంగా ట్యాపింగ్ యార్డు అభివృద్ధికి ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా ఆటోనగర్ ఏర్పాటుకు సంబంధించిన హామీని కూడా అమలు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. పట్టణం పరిశుభ్రంగా ఉండటం ప్రతి ఒక్కరి సామూహిక బాధ్యత అని, అన్ని కార్యక్రమాలను ప్రభుత్వం లేదా మున్సిపల్ సిబ్బంది మాత్రమే నిర్వహించలేరని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలు స్వచ్ఛతను తమ రోజువారీ జీవితంలో భాగం చేసుకుని, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అధికారులు, స్థానిక సంస్థలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం గుంటూరు రోడ్ మార్కెట్ దగ్గర మొక్కలు నాటారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ప్రజలు, ఉమ్మడి కూటమి నాయకులు పాల్గొన్నారు.

## బాపట్ల జిల్లా పరిషత్‌కు ప్రత్యేక అధికారిగా కలెక్టర్
### 25 నుంచి బాధ్యతలు స్వీకరణ.. రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లకు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు

**బాపట్ల, సెప్టెంబర్ 19 (పెన్ పవర్):**
బాపట్ల నూతన జిల్లా పరిషత్‌కు ఈనెల 25వ తేదీ నుంచి ప్రత్యేక అధికారిగా బాపట్ల జిల్లా కలెక్టర్ డా. వాసుదేవ వినోద్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ల పదవీకాలం ఈనెల 24వ తేదీతో ముగియనుంది. దీంతో రాష్ట్రంలోని జిల్లా పరిషత్తులకు ఆయా జిల్లాల కలెక్టర్లను ప్రత్యేక అధికారులుగా ప్రభుత్వం నియమించింది. ఇందులో భాగంగా బాపట్ల జిల్లా పరిషత్‌కు కలెక్టర్ డా. వాసుదేవ వినోద్ కుమార్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టనున్నారు.
ఈ నియామకం ఈనెల 25వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. జిల్లా పరిషత్ పరిపాలనా వ్యవహారాలను ప్రత్యేక



అధికారి హోదాలో కలెక్టర్ పర్యవేక్షించనున్నారు.

## విజయ క్రాంతి డిగ్రీ కాలేజ్ ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం




**చల్లపల్లి, పెన్ పవర్ సెప్టెంబర్ 19**
స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా చల్లపల్లిలోని విజయ క్రాంతి డిగ్రీ కాలేజ్ ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు.
చల్లపల్లి - నాగాయలంక రోడ్ లో బ్రహ్మంగారి గుడి దాటిన నుండి కాసానగర్ జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని విద్యార్థులు శ్రమదానం చేసి తొలగించారు.



ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి జరిగే నష్టం, పరిశుభ్రత ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. “స్వచ్ఛతే సేవ, ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం” అనే నినాదంతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మరియు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
విద్యార్థుల సేవా నిరతిని స్థానిక ప్రజలు, కళాశాల యాజమాన్యం అభినందించారు.

## పరిశుభ్రమైన గ్రామాలతో ఆరోగ్యకరమైన సమాజం సాధ్యం: కలెక్టర్ డా. జి. లక్ష్మీశ




**విజయవాడ, పెన్ పవర్, సెప్టెంబర్, 19,**
కంచికచర్ల, సెప్టెంబర్ 19: స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పిలుపునిచ్చారు. మున్నలూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, తడి, పొడి చెత్తను ఇంటివద్దే వేరు చేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా



మొక్కలు నాటి సంరక్షించాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అనంతరం గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణ, కిచెన్ గార్డెన్స్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.
ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మొక్క నాటారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పారిశుద్ధ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఏపీసీసీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సమావేశంలో ఆమంచి

**విజయవాడ, సెప్టెంబర్ 19 (పెన్ పవర్):**
ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ (ఏపీసీసీ) పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సమావేశం శనివారం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో నిర్వహించారు. ఏపీసీసీ ఇన్‌చార్జి, కర్ణాటక ఎమ్మెల్సీ పి.వి. మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి చీరాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీ రాజకీయ పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణ, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై కమిటీ సభ్యులు చర్చించినట్లు తెలిపారు. సమావేశంలో పార్టీకి సంబంధించిన పలు రాజకీయ అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు.



## అవినీతి కుంభకోణాల నుంచి జగన్ ఎప్పటికీ తప్పించుకోలేరు : ప్రత్తిపాటి
### 2019-24 మధ్య జరిగిన స్కామ్ లన్నీ బయటకు వస్తాయి.: ప్రత్తిపాటి.

**-జగన్ అవినీతిలో భాగస్వాములైన వారు అప్రూవర్లుగా మారడానికి సిద్ధమవుతున్నారు : ప్రత్తిపాటి**
**-25న చిలకలూరిపేట-నరసరావుపేట జాతీయరహదారి పనులకు శంకుస్థాపన : లావు**

**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, సెప్టెంబర్ 19 :**
ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ సహకారంతో చిలకలూరిపేట నియోజకవర్గానికి 7 పంచాయతీ భవనాలు మంజూరయ్యాయని, ఒక్కో భవనాన్ని రూ.32 లక్షలతో నిర్మిస్తున్నామని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.
నాదెండ్ల మండలం అమీన్ సాహెబ్ పాలెంలో రూ.32 లక్షల పంచాయతీ రాజ్ నిధులతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎంపీ లావు శనివారం సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం వారు గోవిందాపురంలో టీడీపీ సీనియర్ నాయకులు దివంగత నేత, గుత్తా వెంకటేశ్వర్లు విగ్రహాన్ని ఆవిష్కరించి విలేకరులతో మాట్లాడారు.

**2019-24 కుంభకోణాలన్నీ ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి: ప్రత్తిపాటి**
జగన్ . వైసీపీనేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకొని, అడ్డగోలుగా అవినీతికి పాల్పడ్డారని, ఆ కుంభకోణాలన్నీ ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని ప్రత్తిపాటి తెలిపారు. మద్యం కుంభకోణంలో ప్రమేయమున్న వారు అప్రూవర్లుగా మారడానికి, జైళ్లకు వెళ్లడానికి సిద్ధమయ్యారని, మిగిలిన కుంభకోణాల్లోనూ పాత్రధారులు,



సూత్రధారులైన వారు ఎప్పటికీ తప్పించుకోలేరని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. కాలమే సమాధానం చెబుతుందనేలా జగన్ దోపిడీలు బహిర్గతం అవుతున్నాయన్నారు. చేసిన అవినీతి, దుర్మార్గాలు ప్రజలకు తెలియకుండా కప్పిపుచ్చుకోవడానికే జగన్.. వైసీపీనేతలు అవాస్తవాలు, అబద్ధాలతో ప్రభుత్వాన్ని నిందిస్తున్నారన్నారు.

**వైసీపీనేతల ఆశల్ని ప్రజలే నిర్వీర్యం చేస్తారు..**
జగన్...వైసీపీనేతలు ఎప్పటికీ తప్పించుకోలేరని, ప్రజల దృష్టిలో వారు ఎప్పటికీ దోషులేనని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. 2029లో అధికారంలోకి వస్తున్నామని వైసీపీనాయకులు పగటి కలలు కంటున్నారని, వారి ఆశల్ని ప్రజలే నిర్వీర్యం చేస్తారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ కూటమిపార్టీలదే విజయమని, వైసీపీని ఎక్కడికి పంపించాలో ప్రజలకు తెలుసని ప్రత్తిపాటి తెలిపారు.

**రూ.2వేల కోట్లతో జల్ జీవన్, అమృత్ పథకాల పనులు : ఎంపీ లావు**
అమీన్ సాహెబ్ పాలెంలో రూ.32లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటితో కలిసి ప్రారంభించామని, పట్టణాలు, గ్రామాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే జల్ జీవన్ మిషన్ పనులు వేగంగా జరుగుతున్నాయని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు.
జలజీవన్ మిషన్, అమృత్ పథకాల పరిధిలో రూ.2 వేలకోట్లతో పార్లమెంట్ వ్యాప్తంగా పలు అభివృద్ధి పనులు చేపట్టినట్టు ఎంపీ తెలిపారు. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాకే ఎన్నికలకు వెళ్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు హామీని నెరవేర్చే దిశగా ముందుకు సాగుతున్నామని ఆయన చెప్పారు.
చిలకలూరిపేట-నరసరావుపేట జాతీయ రహదారి నిర్మాణ పనులకు 25న శంకుస్థాపన చేయనున్నట్టు చెప్పిన లావు.. మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యేల సమక్షంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. పొలాలకు వెళ్లే రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రజల నుంచి వినతులు వస్తున్నాయని, ఆ పనులు కూడా త్వరలోనే చేపడతామని ఎంపీ స్పష్టంచేశారు. జీ రామ్ జీ పథకం కింద ఏపీకి రూ.7వేలకోట్ల నిధులు మంజూరు అయ్యాయని, గ్రామాల అభివృద్ధి కోసమే కేంద్రం ఆ నిధుల్ని కేటాయించిందన్నారు.
కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ జయప్రసాద్, పునాటి కోటేశ్వరరావు, పునాటి సుధీర్, గుర్రం నాగ పూర్ణచంద్రరావు, గుర్రం ఉపేంద్ర, వెంకయ్య చౌదరి, వజ్జ సింగయ్య, రంగనాథుల నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి చిరునామాగా ఏపీ : ప్రత్తిపాటి
### ముస్లిం మైనారిటీలకు టీడీపీ పాలనలో జరిగిన మేలు.. మరే ప్రభుత్వంలో జరగలేదు.

**కూటమి ప్రభుత్వంలో మైనారిటీలు సంతోషంగా ఉన్నారు.**
**సాతులూరులో రూ.50 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న ప్రత్తిపాటి.**

**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, సెప్టెంబర్ 19 :**
ఏపీని అభివృద్ధికి చిరునామాగా మార్చాలన్న పట్టుదల, సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు రేయింబవళ్లు శ్రమిస్తున్నారని, ఆయన నాయకత్వంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.
శనివారం ఆయన నాదెండ్ల మండలం సాతులూరులో రూ.50 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. స్థానిక నాయకులతో కలిసి పొలిమేర వద్ద రూ.10 లక్షల మైనింగ్ నిధులతో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించిన ప్రత్తిపాటి.. ఎన్టీఆర్ కూడలిలో రూ.20 లక్షల టీటీడీనిధులతో నిర్మించనున్న రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలోని శివాలయం వద్ద రూ.20 లక్షల జీ.రామ్. జీ నిధులతో నిర్మించిన మరో వంతెనని ప్రారంభించారు. అనంతరం ముస్లింల ఈద్గా నిర్మాణ స్థలాన్ని పరిశీలించి, వారితో



ముఖాముఖీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి గ్రామస్తుల్ని ఉద్దేశించి మాట్లాడారు.
2014-19లో టీడీపీ ప్రభుత్వంలో నియోజకవర్గానికి మంజూరైన అభివృద్ధి పనుల్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిచేసి ఉంటే, నేడు ప్రజలు ఎలాంటి సమస్యల్లేకుండా సంతోషంగా జీవించేవారని, గత పాలకుల నిర్లక్ష్యం, అవినీతి పోకడలు, స్వార్థ రాజకీయాలు ప్రజలకు కష్టనష్టాలు తీసుకొచ్చాయని ప్రత్తిపాటి పేర్కొన్నారు.
ముస్లింలకు టీడీపీ పాలనలోజరిగిన మేలు.. మరే ప్రభుత్వంలోనూ జరగలేదు..
టీడీపీ పాలనలో ముస్లిం-మైనారిటీలకు జరిగిన మేలు.. మరే ప్రభుత్వంలోనూ జరగలేదని, ఇమామ్-మౌజమ్ లకు గౌరవవేతనం, మదర్సాలు, షాదీఖానాలు, ఈద్గాల నిర్మాణం, వక్ఫ్ భూముల పరిరక్షణ, దుకాన్ -- మకాన్, రంజాన్ తోఫా, పెండ్లి కానుక వంటి ప్రయోజనాలు విరివిగా లభించాయని ప్రత్తిపాటి వివరించారు. కూటమి ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలు సంతోషంగా ఉన్నారని, వారి రాజకీయ, ఆర్థిక అభ్యున్నతికి చంద్రబాబు ప్రభుత్వం కృషి చేస్తోందని, వారి హక్కుల్ని కాపాడుతూ.. సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు.
కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు నార్నే కోటయ్య స్వామి, షేక్ సైదా, శివ సత్యం, నందిగాం శివయ్య, నార్నే శ్రీను, కమ్మ శ్రీను, జంపని వసంతరావు, చుండు అనిల్, ఈధర సాంబశివరావు, ఐనవోలు రాధా, చెన్నకేశవులు టీడీపీ నాయకులు, కూటమి నాయకులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇళ్ల స్థలాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 19,**
ప్రజలకు అన్ని వ్యవస్థలు జవాబుదారీగా ఉండాలని, ఇళ్ల స్థలాలపై ప్రత్యేక దృష్టిస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శనివారం స్థానిక తూర్పు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే నసీర్ స్వయంగా స్వీకరించారు. ఇళ్ల స్థలాల కేటాయింపు, మురుగు నీటి సమస్య, విద్యుత్ స్థంభాల ఏర్పాటు వంటి వాటిపై ప్రజలు అర్జీలు అందజేశారు. ఆయా సమస్యలపై వెంటనే ఎమ్మెల్యే నసీర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే ఆయా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో కూటమి రెండేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేశామని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లామని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఇళ్ల రెగ్యులరైజేషన్ ప్రక్రియను చేపట్టామని తెలిపారు. త్వరలో నూతన పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం అందించబోతోందని చెప్పారు. ఇప్పటికే స్పౌజ్ కేటగిరీ కింద భార్యాభర్తల్లో ఒకరు మరణిస్తే వెంటనే భాగస్వామికి అందించామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అంచెలంచెల వ్యవస్థను తీసుకొచ్చిందని, మండల, జిల్లా స్థాయిలోనూ పీజీఆర్ఎస్ నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజలకు సంతృప్తికరస్థాయిలో అధికారులు సేవలందించాలని



సూచించారు.

# కరువు ప్రాంతాల్లో జగన్ టూర్



**విజయవాడ, సెప్టెంబర్ 19, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరో అంశాన్ని ప్రధానంగా తీసుకుని ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటివరకు మెగా డీఎస్సీ అంశంపై ఎక్కువగా దృష్టి పెట్టిన పార్టీ.. ప్రస్తుతం రైతుల సమస్యలు, వర్షాభావ పరిస్థితులను కూడా ఉద్యమ కార్యాచరణలోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు వెల్లడించింది. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ ప్రధాన కార్యదర్శులు, రీజనల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సమావేశంలో రాష్ట్రంలోని వర్షపాతం, సాగు పరిస్థితులు, నీటి కొరత, రైతుల ఇబ్బందులపై జిల్లా వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నట్లు వైఎస్సార్సీపీ తెలిపింది. పార్టీ విడుదల చేసిన వివరాల ప్రకారం.. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని జగన్ పేర్కొన్నారు. మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, వాటిలో 332 మండలాల్లో పరిస్థితి తీవ్రంగా ఉందని ఆయన తెలిపారు.సాగు విస్తీర్ణం తగ్గడంపైనా సమావేశంలో చర్చ జరిగింది. సాధారణంగా ఖరీఫ్‌లో 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా, ఈసారి 56.4 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు వేసినట్లు జగన్ పేర్కొన్నారు. దాదాపు 20 లక్షల ఎకరాలు సాగుకు దూరంగా ఉన్నాయని చెప్పారు. పంటలు వేసిన రైతులు కూడా వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు నష్టపోయారని ఆయన వెల్లడించారు. ఈ గణాంకాలు వైఎస్సార్సీపీ వర్గాలు వెల్లడించినవే.వర్షాభావానికి సంబంధించి ప్రభుత్వం తగిన సమయంలో చర్యలు తీసుకోలేదని జగన్ ఆరోపించారు. ఫిబ్రవరిలోనే ఎల్‌నినో ప్రభావంపై హెచ్చరికలు వచ్చినప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలోనే "ఎల్లో నినో" అంటూ కూటమి ప్రభుత్వంపై రాజకీయ విమర్శ చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి నుంచే ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనే ప్రణాళికలు ప్రారంభించిందని మరో నివేదిక పేర్కొంటోంది.రైతులకు పంట నష్టం, సాగు చేయలేని భూములకు పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వంటి అంశాలపై జగన్ పలు డిమాండ్లు చేశారు. కరువు ప్రభావిత మండలాలను ప్రకటించడం, రైతు రుణాల పునర్వ్యవస్థీకరణ, పంటల బీమాను పునరుద్ధరించడం వంటి చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే వైఎస్సార్సీపీ నేతలు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకుని జిల్లా వారీగా డిమాండ్లను ప్రభుత్వానికి అందించాలని సూచించారు.కరువు ప్రభావిత ప్రాంతాల్లో పార్టీ కార్యక్రమాలను విస్తరించే అంశంపైనా సమావేశంలో దిశానిర్దేశం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మండలం, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో రైతులతో కలిసి కార్యక్రమాలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని జగన్ సూచించారు. రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని, మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.ఖరీఫ్‌లో సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి పాత బకాయిలైన రూ.3,000 కోట్లను విడుదల చేయాలన్నారు. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెండింగ్‌లో ఉన్న రూ.41,000 చెల్లించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6,000 కోట్లు అందించాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని
ఆరోపించారు.సాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబడుతూ, పోలవరం నిల్వ సామర్థ్యంపై రాజీపడుతూ ఉనికి కోసం లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. కరవు బారిన పడిన గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉచిత ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారుతాను కూడా పరిస్థితిని బట్టి కరువు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తానని తెలిపారు. దీంతో రాబోయే రోజుల్లో రైతుల సమస్యలు వైఎస్సార్సీపీ రాజకీయ కార్యక్రమాల్లో ప్రధాన అంశంగా మారే అవకాశం ఉంది.

# సర్కార్ కు తలనొప్పిగా మారిన వివేకా కేసు



**కడప, సెప్టెంబర్ 19, పెన్ పవర్:**
వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చాలాకాలంగా చర్చనీయాంశంగా కొనసాగుతోంది. కేసు దర్యాప్తు, న్యాయపరమైన పరిణామాలు, కుటుంబ సభ్యుల మధ్య ఉన్న విభేదాలు రాజకీయ చర్చలకు కూడా కారణమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వివేకా కుమార్తె వైఎస్ సునీత చేస్తున్న ప్రయత్నాలు మరోసారి రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.తన తండ్రి హత్య కేసులో పూర్తిస్థాయి న్యాయం జరగలేదని సునీత చెబుతున్నారు. 2026 మార్చిలో ఆమె సీబీఐ దర్యాప్తుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దర్యాప్తు అన్ని కోణాల్లో జరగలేదని, కేసులో మరింత సమగ్ర విచారణ అవసరమని ఆమె పేర్కొన్నారు. తన తండ్రి హత్యకు సంబంధించిన వాస్తవాలు పూర్తిగా బయటకు రావాలంటే మరికొందరిని కూడా ప్రశ్నించాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు.ఈ కేసులో సునీత గతంలో కూడా న్యాయపోరాటం కొనసాగించారు. నిందితులకు లభించిన బెయిల్‌ను సవాల్ చేయడంతో పాటు, మరింత దర్యాప్తు చేయాలని కోరుతూ ఆమె సుప్రీంకోర్టు ను ఆశ్రయించారు. అయితే 2026 మార్చిలో సుప్రీంకోర్టు ఆమె దాఖలు చేసిన సంబంధిత పిటిషన్లను కొట్టివేసింది. దీంతో కేసు తదుపరి న్యాయ ప్రక్రియపై దృష్టి నెలకొంది.మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సునీత ఆరోపణలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కేసు దర్యాప్తును రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. సునీత చర్యలు రాజకీయంగా కొందరికి ఉపయోగపడుతున్నాయని ఆయన ఆరోపించారు. అయితే ఇవి అవినాష్ రెడ్డి చేసిన ఆరోపణలేనని, వాటిని తుది వాస్తవాలుగా పరిగణించలేమని గుర్తించాలి.ఈ పరిణామాల మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని ఎలా ఎదుర్కొంటుందన్న చర్చ కూడా రాజకీయ వర్గాల్లో కనిపిస్తోంది. వివేకా కుమార్తె న్యాయం కోసం చేస్తున్న న్యాయపోరాటాన్ని రాజకీయ అంశంగా మార్చకుండా, కేసు కోర్టు పరిధిలోనే కొనసాగేందుకు ప్రాధాన్యం ఇవ్వాలా అనే ప్రశ్న కూడా ముందుకు వస్తోంది. అదే సమయంలో సునీతకు సంబంధించిన రాజకీయ సంబంధాలు, ఆమె చేసిన వ్యాఖ్యలను వివిధ పార్టీలు తమకు అనుకూలంగా విశ్లేషించుకోవడం కూడా జరుగుతోంది.ఈ కేసు ఇప్పటికే అనేక దర్యాప్తు దశలను దాటింది. 2026లో కూడా దీనిపై రాజకీయ, న్యాయపరమైన చర్చ కొనసాగుతోంది. అంతేకాకుండా ఆగస్టు 2026లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వివేకానందరెడ్డి హత్య కేసుతో సంబంధం ఉన్న మనీలాండరింగ్ దర్యాప్తులో కడప, హైదరాబాద్ ప్రాంతాల్లో కొన్ని చోట్ల సోదాలు నిర్వహించినట్లు వార్తలు వచ్చాయి. అందువల్ల ఈ వ్యవహారంలో రాజకీయ వ్యాఖ్యలకు మించి కోర్టు ప్రక్రియ, దర్యాప్తు సంస్థల చర్యలు, అధికారిక రికార్డులు కీలకంగా మారనున్నాయి. వివేకా కుటుంబానికి న్యాయం జరిగిందనే భావన కలగాలంటే కేసులోని అంశాలు న్యాయపరమైన ప్రక్రియ ద్వారా స్పష్టతకు రావాల్సి ఉంటుంది.

# మండుతున్న కూరగాయల ధరలు



**విజయవాడ, సెప్టెంబర్ 19, పెన్ పవర్:**
సామాన్యులపై నిత్యావసర సరుకుల భారం పడుతోంది. ఇప్పటికే షుగర్ ధరలు పెరగ్గా.. ఇప్పుడు కూరగాయల ధరలు కూడా పెరుగుతున్నాయి. గత కొద్ది రోజులుగా ఉల్లిపాయల ధరలు ఘాటెక్కిస్తున్నాయి. ధరలు ఒక్కసారిగా కొండెక్కాయి. కొద్ది రోజుల క్రితం కిలో ఉల్లి రూ.20కే లభించగా.. ఇప్పుడు ఏకంగా రూ.60కి చేరుకుంది. కొద్ది రోజుల వ్యవధిలోనే రూ.40 పెరగడం సామాన్యులకు భారమనే చెప్పవచ్చు. ఎల్‌నీనో ప్రభావంతో పంట ఉత్పత్తి లేకపోవడం, తెగుళ్లు, ఇతర కారణాల వల్ల డిమాండ్‌కు తగ్గట్లు సరఫరా లేకపోవడంతో ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ధరలు ఇలాగే కొనసాగే అవకాశముందని, రానున్న రోజుల్లో పెరిగే అవకాశముందని అంచనాలు వేస్తున్నారు. కిలో ఉల్లి రూ.100కి చేరుకున్నా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. గతంలో పలుమార్లు ఉల్లి సెంచరీ కొట్టింది. ఇప్పుడు కూడా అదే తరహాలో పరిస్థితులు రానున్నాయని అంటున్నారు. దీంతో సామాన్యులు ఉల్లిని చూస్తే బెంబేలెత్తిపోతున్నారు.హైదరాబాద్‌లోని రైతు బజార్లలో ఉల్లిపాయల ధరలు పెరిగాయి. నగరంలోని రైతు బజార్లలో కిలో ఉల్లి రూ.54 పలుకుతోంది. ఇక కిలో టమాట రూ.17. వంగ రూ.28, బెండకాయ రూ.35, పచ్చిమిర్చి రూ.40, క్యాలీఫ్లవర్ రూ.21, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.50, దొండకాయ రూ.35, ఆలు రూ.17, సొరకాయ రూ.9, పొట్లకాయ రూ.15, బీన్స్ రూ.60, గోరుచిక్కుడు రూ.28, చిక్కుడుకాయ రూ.40, దోసకాయ రూ.28, బీరకాయ రూ.32, కాకరకాయ రూ.32, చామగడ్డ రూ.28, కీరదోస రూ.40, క్యాప్సికం రూ.41, బీట్ రూట్ రూ.35, కందగడ్డ రూ.35, చిలగడదుంప రూ.35, మామిడి రూ.45, మునగ రూ.45 పలుకుతోంది.విజయవాడలో కిలో ఉల్లి రూ. 55కు లభిస్తున్నాయి. ఇక వంకాయలు రూ.22, టమాటా రూ.26, బెండకాయ రూ.18, పచ్చిమిర్చి రూ.30, కాకర రూ.32, బీర రూ.30, క్యాలీఫ్లవర్ రూ.35, క్యాబేజీ రూ.24, క్యారెట్ రూ.48, దొండకాయ రూ.24, బంగాళదుంప రూ.24, గోరుచిక్కుళ్లు రూ.28, దోస రూ.22, పొట్లకాయ రూ.13, చామదుంప రూ.34 పలుకుతున్నాయి.అయితే రైతు బజార్లలో ధరలు ఇలా ఉండగా.. రిటైల్ మారట?ట్లలో కిలో ఉల్లి రూ.70కి విక్రయిస్తున్నారు. పంట దిగుబడి తగ్గడం, మార్కెట్లో సరఫరా లేకపోవడంతో ఉల్లి ధరలు పెరుగుతున్నట్లు చెబుతున్నారు. జులైలో రోడ్ల పక్కన ట్రాలీ ఆటోల్లో రూ.100కు 4 కిలోల ఉల్లి ఇవ్వగా.. ఇప్పుడు ట్రాలీ వాహనాల్లో కూడా రూ.200కి 3 కిలోల చొప్పున అందిస్తున్నారు. అయితే ఏపీ ప్రభుత్వం సామాన్యులకు ఉల్లి ధరల నుంచి ఉపశమనం కలిగించే ప్రయత్నం చేస్తోంది. అందులో భాగంగా రైతు బజార్లలో రూ.35కే కిలో చొప్పును అందిస్తోంది. అటు కేంద్రం కూడా రంగంలోకి దిగింది. ధరల స్థిరీకరణ నిధి ద్వారా 1 లక్షా 21 వేల టన్నుల బఫర్ స్టాక్ అందుబాటులోకి తెచ్చింది. మరోవైపు వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టించి డబ్బులు సొమ్ము చేసుకుంటున్నారు. హైదరాబాద్‌లోని మలక్ పేట్ మార్కెట్లో క్వింటా ఉల్లి రూ.5500 పలుకుతోంది. అటు దేశవ్యాప్తంగా కూడా ధరలు పెరిగాయి

# ఆర్థిక రాజధానిగా విశాఖ

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 19, పెన్ పవర్:** విశాఖపట్నం భవిష్యత్‌లో మరింత వేగంగా విస్తరించే అవకాశాలున్న నగరంగా మారుతోంది. ఐటీ రంగం, డేటా సెంటర్లు (, పరిశ్రమలు, పర్యాటకం, వాణిజ్య కార్యకలాపాలు పెరుగుతున్న కొద్దీ నగరానికి వచ్చే ప్రజల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. మిట్టల్ స్టీల్ ప్లాంట్ వంటి భారీ పారిశ్రామిక ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ఉపాధి అవకాశాలు పెరిగి ఇతర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు నగరానికి వచ్చే పరిస్థితి ఏర్పడవచ్చు. దీంతో రాబోయే సంవత్సరాల్లో విశాఖ జనాభా గణనీయంగా పెరిగే అవకాశం ఉందనే అంచనాలు వినిపిస్తున్నాయి.జనాభా పెరుగుదలతో పాటు నగర మౌలిక సదుపాయాలను కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంటుంది. ముఖ్యంగా రవాణా, విద్యుత్, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు సరిపడా నీటి లభ్యత వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి. ప్రస్తుతం ఉన్న నీటి వనరులతో భవిష్యత్ అవసరాలను తీర్చడం కష్టమయ్యే అవకాశం ఉన్నందున ముందుగానే దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.ఈ విషయంలో సింగపూర్ ) అనుసరిస్తున్న నీటి నిర్వహణ విధానాలను ఉదాహరణగా తీసుకోవచ్చనే అభిప్రాయం ఉంది. సహజ నీటి వనరులు పరిమితంగా ఉన్న సింగపూర్.. వర్షపు నీటిని సేకరించడం, ఉపయోగించిన నీటిని శుద్ధి చేసి మళ్లీ వినియోగించడం, సముద్రపు నీటిని డీశాలినేషన్ చేయడం వంటి పద్ధతులను విస్తృతంగా ఉపయోగిస్తోంది. ముఖ్యంగా నీటి పునర్వినియోగం సముద్రపు నీటిని తాగునీటిగా మార్చే సాంకేతికత ద్వారా అక్కడ నీటి అవసరాల్లో గణనీయమైన భాగాన్ని సమకూర్చుకుంటున్నారు. ఈ విధానం విశాఖకు కూడా ఉపయోగపడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.విశాఖ చుట్టుపక్కల ఉన్న రిజర్వాయర్లు కూడా నగర నీటి అవసరాలకు ముఖ్యమైన వనరులే. వాటిలో పూడిక తొలగించడం, సామర్థ్యాన్ని పెంచడం, ఆధునిక నిర్వహణ పద్ధతులు అమలు చేయడం ద్వారా నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపరచవచ్చని సూచిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న వనరులను సమర్థంగా ఉపయోగించుకోవడంతో పాటు కొత్త నీటి వనరులపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందిపోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరిజలాలను విశాఖకు తీసుకురావడం కూడా భవిష్యత్ నీటి అవసరాలకు ఉపయోగపడే అంశంగా భావిస్తున్నారు. ఈ నీటిని నిల్వ చేసేందుకు నగరం చుట్టూ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. అదే సమయంలో సముద్రం అందుబాటులో ఉన్నందున పెద్ద స్థాయిలో డీశాలినేషన్ ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశాన్ని కూడా పరిశీలించవచ్చు.తాగునీరు, పరిశ్రమలు, భవిష్యత్ జనాభా అవసరాలను ఒకే ప్రణాళికలోకి తీసుకువచ్చి సమగ్ర వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తే నీటి సరఫరాను మరింత సమర్థంగా నిర్వహించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. వర్షపు నీటి సంరక్షణ, రీసైక్లింగ్, రిజర్వాయర్ల ఆధునీకరణ, గోదావరి జలాల వినియోగం, డీశాలినేషన్ వంటి మార్గాలను కలిపి ముందుకు తీసుకెళ్లగలిగితే విశాఖ భవిష్యత్ నీటి అవసరాలకు ముందుగానే సిద్ధమయ్యే అవకాశం ఉంటుంది.

# దుగరాజపట్నంలో అత్యాధునిక గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్

**ఒంగోలు, సెప్టెంబర్ 19, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ముఖచిత్రాన్ని సమూలంగా మార్చే దిశగా మరో భారీ ప్రాజెక్టు రాష్ట్రానికి రాబోతోంది. తిరుపతి జిల్లా పరిధిలోని దుగరాజపట్నంలో అత్యాధునిక గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ ఏర్పాటుకు కేంద్ర రక్షణ రంగ దిగ్గజ సంస్థ మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ సిద్ధమైంది. రాబోయే 5 నుంచి 7 ఏళ్ల కాలపరిమితిలో దాదాపు 15,000 కోట్ల భారీ పెట్టుబడితో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న దుగరాజపట్నం పోర్టు కల ఎట్టకేలకు భారీ నౌకా నిర్మాణ కేంద్రంగా సాకారం కానుండటం రాష్ట్ర పారిశ్రామిక రంగానికి పెద్ద ముందడుగుగా మారింది.ఈ భారీ ప్రాజెక్టు ఏర్పాటు ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో ఏకంగా 45,000 మంది నిరుద్యోగ యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ఇంజనీరింగ్, మెరైన్ టెక్నాలజీ, వెల్డింగ్, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో నైపుణ్యం కలిగిన స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. అంతేకాకుండా షిప్‌యార్డ్ అనుబంధంగా వందలాది ఎంఎస్ఎంఈ యూనిట్లు, అనుబంధ విడిభాగాల పరిశ్రమలు కూడా ఈ ప్రాంతంలో కొలువుదీరనుండటంతో రాయలసీమ ముఖద్వారమైన తిరుపతి, నెల్లూరు జిల్లాల రూపురేఖలు మారనున్నాయి.మజగావ్ డాక్‌ను రాష్ట్రానికి ఆకర్షించడంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన వ్యూహాత్మక చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. రక్షణ నౌకలు, జలాంతర్గాముల నిర్మాణంలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన మజగావ్ డాక్.. పెద్ద ఎత్తున కమర్షియల్ షిప్‌బిల్డింగ్ రంగంలోకి అడుగుపెట్టేందుకు దుగరాజపట్నం భౌగోళిక పరిస్థితులు, తీరప్రాంతం అత్యంత అనుకూలమైనవని గుర్తించింది. ఏపీ మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ జరిపిన సంప్రదింపులు కొలిక్కి రావడంతో, ఈ నెల 20న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో రూ.15,000 కోట్ల పెట్టుబడి అవగాహన ఒప్పందం పై సంతకాలు చేసేందుకు రంగం సిద్ధమైంది.దేశంలోనే అతిపెద్ద రెండో తీరప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి మారిటైమ్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి ఈ ప్రాజెక్టు వెన్నెముకగా నిలవనుంది. కేంద్ర ప్రభుత్వ మారిటైమ్ అమృత్ కాల్ విజన్ -- 2047 లక్ష్యాలకు అనుగుణంగా భారీ వాణిజ్య నౌకలను దేశీయంగానే నిర్మించే బృహత్తర ప్రణాళికలో దుగరాజపట్నం షిప్‌యార్డ్ అత్యంత కీలక పాత్ర పోషించనుంది.

# క్యూవీఎస్ఈ ఫేక్ యాప్లో పెట్టుబడుల పేరుతో రూ.13.25 లక్షల మోసం

- కేసు నమోదు
- అధిక లాభాల ఆశ చూపే ఫేక్ ఇన్వెస్ట్మెంట్ యాప్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఇన్స్పెక్టర్ కమలాకర్

**జడ్చర్ల: పెన్ పవర్:** జడ్చర్ల పట్టణానికి చెందిన పలువురు వ్యక్తులు "క్యూవీఎస్ఈ" అనే యాప్లో పెట్టుబడులు పెడితే డాలర్ల రూపంలో అధిక లాభాలు వస్తాయని నమ్మి మొత్తం సుమారు రూ.13.25 లక్షలు పెట్టుబడిగా పెట్టి మోసపోయిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జడ్చర్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కమలాకర్ తెలిపారు.ఫిర్యాదు వివరాల ప్రకారం.. ఒక వ్యక్తి క్యూవీఎస్ఈ యాప్లో తాను పెట్టుబడి పెట్టి లాభాలు పొందుతున్నట్లు చూపిస్తూ పలువురిని నమ్మించినట్లు తెలిపారు. అతను పంపిన లింక్ ద్వారా బాధితులు యాప్ను ఇన్స్టాల్ చేసుకుని మొదట కొంత మొత్తాన్ని ఫోన్పే ద్వారా చెల్లించారు. అనంతరం యాప్లో తమ పెట్టుబడి డాలర్ల రూపంలో పెరుగుతున్నట్లు కనిపించడంతో దానిని నిజమైన లాభంగా భావించి మరింత డబ్బును పెట్టుబడిగా పెట్టారు.ఈ క్రమంలో సొంత డబ్బులతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, పరిచయస్తుల నుంచి సేకరించిన మొత్తాలను ఫోన్పే, నగదు రూపంలో చెల్లించి మొత్తం రూ.13,25,000/- వరకు పెట్టుబడి పెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.అయితే యాప్లో డబ్బు పెరుగుతున్నట్లు కనిపించినప్పటికీ, ఆ మొత్తాన్ని విత్డ్రా చేసుకునే అవకాశం లేకపోవడంతో అనుమానం వ్యక్తం చేశారు. సంబంధిత వ్యక్తిని సంప్రదించగా మరికొంత సమయం వేచి ఉండాలని చెప్పినట్లు తెలిపారు. దీంతో తాము మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు 18-09-2026న జడ్చర్ల పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఇన్స్పెక్టర్ కమలాకర్ తెలిపారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కమలాకర్ మాట్లాడుతూ.. తక్కువ సమయంలో అధిక లాభాలు, డాలర్ల రూపంలో భారీ రాబడులు వస్తాయని చెప్పే ఫేక్ ఇన్వెస్ట్మెంట్ యాప్లు, ఆన్లైన్ స్కీమ్లను నమ్మవద్దని సూచించారు. యాప్లో పెట్టుబడి మొత్తం లేదా లాభం పెరుగుతున్నట్లు కనిపించడం మాత్రమే అది నిజమైన పెట్టుబడి అని నిర్ధారించడానికి ఆధారం కాదని తెలిపారు.

పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థ, యాప్ చట్టబద్ధత, విశ్వసనీయతను పూర్తిగా పరిశీలించాలని, తెలియని లింకులపై క్లిక్ చేయవద్దని, అనుమానాస్పద యాప్లను ఇన్స్టాల్ చేయవద్దని సూచించారు. , బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్వర్డ్లు ఎవరికీ వెల్లడించవద్దని హెచ్చరించారు.

